J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 39 04.3.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి





### తిరగబడ్డ తెలంగాణ బిడ్డ

## మోడీతో ఢీకి కేసీఆర్ రెడీ

### ఇది జగన్‌కి కలిసొస్తుందా..?



'బంగారు తెలంగాణ తెచ్చుకున్నట్లుగా బంగారు భారతదేశం తెచ్చుకుందామా...?' ఇదీ ఇటీవల తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు బహిరంగ సభలలో వేస్తున్న ప్రశ్న. ఇప్పటికే తాను బంగారు తెలంగాణను సాధించినట్లు ఆయనకు ఆయనే ప్రకటించేసుకుంటున్నారు. నిజంగా కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ వచ్చిందా...? లేదా..?? అన్న విషయం ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయించాలి.

ఇప్పుడు దేశంలోని ప్రాంతీయపార్టీలన్నిటినీ కలుపుకుని కేంద్రంపై సమరశంఖం పూరించడానికి కంకణం కట్టుకున్నట్టుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఆ దిశగా ఇప్పటికే ఆయన పావులు కదుపుతున్నారు కూడా. ఖబడ్దార్ మోడీ!.. అంటూ

10లో

## మూడు రాజధానులకు హైకోర్టు బ్రేక్

- సిఆర్‌డిఏ చట్టాన్ని అమలు పరచాల్సిందేనని తీర్పు
- ఆరు నెలల్లోగా అమరావతిని అభివృద్ధి చేయాలి
- మూడు నెలల్లోగా రైతులకు ప్లాట్లు ఇవ్వాలి

హైకోర్టులో ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటినుండి ఇప్పటివరకు వందల సంఖ్యలో తీర్పులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చాయి. ఈసారి మూడు రాజధానుల విషయంలోనైనా ఊరట లభిస్తుందనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. రాజధానిగా అమరావతికి బదులుగా విశాఖను చేయాలని తీవ్రప్రయత్నాలు చేస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈసారి కూడా హైకోర్టులో చుక్కెదురయింది.

3లో



శ్రద్ధాంజలి

ప్రతి ఒక్కరినీ ప్రేమగా పలకరించి
పెద్దలను ఎంతగానో గౌరవించి
ప్రజా సమస్యలను పరిష్కరించి
మంచితనం మూర్తీభవించి
మానవత్వమూ మేళవించి
అశేష ప్రజాభిమానం గెలిచి
కుటుంబానికి అండగా నిలిచి
ఆంధ్రప్రదేశ్‌ను అభ్యున్నతివైపు మలిచిన

ఓ అజాతశత్రువా!
మళ్లీ మా మధ్యకి రావా!!

స్వర్గీయ మేకపాటి గౌతమ్‌రెడ్డి గారు
పరిశ్రమలు, వాణిజ్యం, ఐ.టి., నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు మరియు
మౌలిక వసతుల కల్పన శాఖల మంత్రివర్యులు
జననం : 02.11.1971 మరణం : 21-02-2022

శోకతప్త హృదయాలతో...
మేకపాటి కుటుంబం

# గౌతమ్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

## జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి




వివాదరహితుడిగా, సౌమ్యుడిగా, నీతి నిజాయితీ -నిబద్ధతలు గల రాజకీయ నేతగా దివంగత యువ నాయకుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పేరొందారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి కొనియాడారు. గతనెల 27న ఆయన నెల్లూరులోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధికి గౌతమ్‌రెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమని, రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేందుకు వారు చేసిన కృషి అపారమైనదని ఆయన ప్రశంసించారు. అలాంటి మంచి నాయకుడు మృతిచెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి తాము నెలకొల్పిన ఇంజనీ రింగ్ కాలేజీని ప్రభుత్వానికి అప్పగిస్తామని, ఆ కాలేజీలో తమ తనయుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరడం అభినందనీయమన్నారు.

# నేత్రపర్వం.. సంగమేశ్వరుని కల్యాణం

బహుళ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గతనెల 27న మండల కేంద్రమైన సంగంలోని కామాక్షితాయి సమేత శ్రీ సంగమేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి, అమ్మవారికి నేత్రపర్వంగా కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తొలుత స్వామివార్ల ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

# ఆశా కార్యకర్తల సమస్యలు తీర్చండి



డిఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తల సంఘం నాయకురాళ్లు

జిల్లాలో ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ఏపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయమ్మ, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ కలెక్టరేట్‌లో ఉన్న డిఆర్‌ఓ చిన్నఓబులేసును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని, వారికి ప్రసూతి శెలవులు, ఇన్సురెన్స్ సౌకర్యం వంటివి కలిగించాలని విన్నవించారు.


**FORM IV**

(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2022 SIVA PRABHATH REDDY.T


# గ్రామీణ ప్రజలకు 'ఉపాధి హామీ' కల్పించండి

## స్థాయీ సంఘ సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



స్థాయీ సంఘ సమావేశాల్లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులకు సూచించారు. గతనెల 26న నగరంలోని జడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలు సుదీర్ఘంగా జరిగాయి. అనేక అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాలకు అధ్యక్షత వహించిన అరుణమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లావ్యాప్తంగా వరదలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని సంబంధిత శాఖల అధికారు లను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం సేకరించాలన్నారు. ప్రతి గ్రామంలో రైతులు ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు, ఆరబోసుకునేందుకు గోదాములు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని, జిల్లాలో కూడా గ్రామీణప్రాంతాల్లో భూములను ఎంపికచేసి గోదాములు నిర్మించేందుకు కృషిచేయాలని ఆమె పేర్కొన్నారు. సముద్ర తీరప్రాం తాల్లో రోడ్లను ప్రధాన రోడ్లకు అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణాలను ఎక్కడెక్కడ చేపట్టాలో ప్రతిపాదించాలన్నారు. గ్రామాల్లో సామాజిక పింఛన్లను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ మంజూరుచేయాలని సూచించారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ యూనిట్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ సమావేశాల్లో సభ్యులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోట బీసీ వెల్ఫేర్‌హాస్టల్‌కు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించి అక్కడి సమస్యలను తీర్చాలని ఈ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి కోరారు. తొలుత దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి మృతికి అందరూ నివాళులర్పించారు. పలు మండలాల జడ్పీటీసీలతో పాటు ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జడ్పీ సిఇఓ శ్రీనివాస రావు, ఎన్‌డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ రోజ్‌మాండ్, డ్వామా పీడీ తిరుపతయ్య, డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిఇఓ రమేష్, జలవనరుల శాఖ ఎస్‌ఇ కృష్ణ మోహన్, వ్యవసాయశాఖ డీడీ ప్రసాద రావు, ఉద్యానశాఖ ఏ.డి ప్రదీప్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఇ విజయకుమార్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖల జేడీలు డాక్టర్ మహేశ్వరుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విఎస్‌యుకు మంచిరోజులు

## ★ వీసీ సుందరవల్లి ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు

జిల్లాకే తలమానికంగా ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వ సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ఆధ్వర్యంలో అడుగులు పడుతున్నాయి. దాతలు సహకారం అందిస్తే విఎస్‌యులో మరింతగా అభివృద్ధి సాధ్యమవుతుందని. అందరి సహకారంతో విఎస్‌యును అభివృద్ధి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఇటీవల ఆమె నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండే విధంగా గతంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విఎస్‌యును ఏర్పాటుచేశారని, అప్పటి నుంచి ఎంతో అభివృద్ధి జరుగుతోందని అంటూ, జిల్లాలోని దాతలు ముందుకు వచ్చి సహాయసహకారాలందిస్తే భవిష్యత్ తరాలకు కూడా ఎక్కడా ఇబ్బందులు లేకుండా విఎస్‌యులో సౌకర్యాలు కల్పించేందుకు వీలుంటుందన్నారు. విద్యాప్రమాణాలను పెంచడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలతో విఎస్‌యును మరింతగా అభివృద్ధిపథంలో పయనింపజేస్తామని, విఎస్‌యుకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు కోసం కూడా కృషి చేస్తున్నామన్నారు. అందుకు తగ్గట్టుగా విఎస్‌యులో మౌలిక వసతులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. నిర్వహణ భవనం, బాలుర-బాలికల హాస్టల్స్ భవనాలపై మరో అంతస్తు నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. యూనివర్సిటీ తరఫున త్వరలోనే ఇంజనీరింగ్ కళాశాల కూడా ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిపాదనలు పంపివున్నామని, ముఖ్యమంత్రి అందుకు సానుకూలత వ్యక్తం చేసి అన్నివిధాలా సాయం అందిస్తామని చెప్పారని ఆమె వివరించారు. ఈ సమావేశంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

## ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



కలెక్టర్ చక్రధర్‌బాబును సత్కరిస్తున్న విసి సుందరవల్లి

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో చేపట్టిన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, ఎపిఈడబ్ల్యుఐడిసి మరియు ఆర్అండ్‌బి శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై విశ్వవిద్యాలయంలో చేపట్టిన, చేపట్టాల్సిన భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురికాకుండా, ప్రహారీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విశ్వవిద్యాలయం ఉపకులపతికి సూచించారు. విద్యార్థినీ విద్యార్థులకు అదనంగా వసతి భవనాలకు, పరీక్షల భవనం, బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని ఉపకులపతి ఆచార్య సుందరవల్లి, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. సుమారు 600 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయం హాస్టల్స్‌లో ఉంటున్నందున ప్రభుత్వపరంగా వారికి వైద్యసేవలు అందించాలని ఉపకులపతి, జిల్లా కలెక్టర్‌ను కోరగా, కలెక్టర్ స్పందిస్తూ ఆమేరకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. అనంతరం విసి సుందరవల్లి, రిజిస్ట్రార్ డా. ఎల్.వి.కృష్ణారెడ్డి తదితరులు కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు. జేసీ గణేష్‌కుమార్, విఎస్‌యు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సి.కిరణ్మయి, ఎపిఈడబ్ల్యుఐడిసి ఇఇ రవీంద్రబాబు, ఆర్అండ్‌బి ఇఇ వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



# అంతా ధ్వంసం.. ఆగని విధ్వంసం

## • ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఉక్రెయిన్‌పై రష్యా నిప్పుల వాన కురిపిస్తూనే ఉంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ సేనల దండయాత్ర దూకుడుగా సాగుతూనే ఉంది. బాంబులు, క్షిపణుల ప్రయోగాలతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలు స్మశానాలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా కీవ్, ఖర్కివ్ వంటి నగరాలు దాడులతో దద్దరిల్లిపోతున్నాయి. యుద్ధం ప్రారంభమై గురువారం నాటికి ఎనిమిది రోజులవుతున్నా ఉక్రెయిన్‌లో పేలుళ్ళు భారీగానే ఉన్నాయని, ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో ధ్వంసరచన కొనసాగుతూనే ఉందని అంతర్జాతీయ వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా రష్యా సేనలు కదులుతున్నాయి. ఆ నగరాన్ని అన్నివైపుల నుంచి రష్యా చుట్టుముట్టింది. పెద్దపెద్ద భవనాలు, నివాస ప్రాంతాలు సైతం పేలుళ్లతో అట్టుడికిపోతున్నాయి. అంతటా మంటలు వ్యాపిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజలు వణికిపోతున్నారు. అయినప్పటికీ ఉక్రెయిన్ ఈ దాడులను గట్టిగా ప్రతిఘటిస్తోందని వార్తలు వస్తున్నాయి. వేలాదిమంది ప్రజలు బంకర్లలో తలదాచుకుంటున్నారు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. ఇరుదేశాల మధ్య సమరం ఉధృతంగా సాగుతూనే ఉంది. ఈ భీకర దాడుల్లో ఎంతోమంది మృతిచెందుతున్నారని, ఖెర్సన్, ఖర్కీవ్, తదితర నగరాలను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో రష్యా దాడులు మరింత ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

### యుద్ధాన్ని ఆపాలి - ఐరాస

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. యుద్ధాన్ని వెంటనే ఆపాలంటూ ఐక్యరాజ్య సమితి డిమాండ్ చేసింది. 141 దేశాలు అందుకు అనుకూలంగా ఓటేయడంతో ఆమేరకు ఐరాస తీర్మానం చేసింది. యుద్ధం ఆపేసి రష్యా తన బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. అమెరికా ఈ యుద్ధాన్ని ఖండిస్తూ రష్యాపై మరింతగా ఆంక్షలు పెంచింది. అయితే మరోవైపు యుద్ధం మాత్రం కొనసాగుతూనే ఉంది. దీంతో ఈ యుద్ధం చివరికి ఎటు దారి తీస్తుందోననే ఆందోళనతో ప్రపంచదేశాలు ఆందోళనలో ఉన్నాయి. చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరుదేశాల్లోనూ ఇంకోవైపు చర్చల మాటలు కూడా వినపడుతున్నాయి. ఈ యుద్ధం ఆగకుండా ఇలాగే కొనసాగితే పరిస్థితి ఎలా ఉంటుందోననే భయాందోళనలు సర్వత్రా ఉన్నాయి. ఒకవేళ మూడో ప్రపంచయుద్ధం కనుక వస్తే అది అణ్వాయుధాలు, విధ్వంసక ఆయుధాలతోనే జరుగుతుందన్న రష్యా నేతల మాటలు అన్ని దేశాలను వణికిస్తున్నాయి.

యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయులను, విద్యార్థులను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తూ ఉంది. ఇప్పటికే అనేకమంది కేంద్రం కృషితో భారత్‌కు తిరిగి చేరుకున్నారు కూడా.

# పెట్రో ధరలు.. ఇక భగ్గు భగ్గు!

- త్వరలో లీటరు రూ. 120
- ఆ తర్వాత ఇంకా పెరిగే అవకాశం

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇప్పటికే ముడిచమురు ధర ఆకాశానికంటుతోంది. మనదేశంలో కూడా ఇదే పరిస్థితి. అయితే ఇప్పటికి మాత్రం ధరలు యధాతథంగానే ఉన్నా, 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిన తర్వాత మనదేశంలోనూ పెట్రో ధరల మోత మోగుతుందని, ప్రజలకు ఈ పెరిగిన ధరల వాత తప్పదని అంటున్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర తాజాగా 110 డాలర్లకు చేరుకోవడంతో దాని ప్రభావం భారత్ మీద కూడా తప్పకుండా ఉంటుంది. నాలుగునెలల కిందట 75 డాలర్లున్న పెట్రో ధరలు ఇప్పుడు 110 డాలర్లకు పెరగడంతో అంతటా ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చి 1 నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న ముడిచమురు బ్యారెల్ ధర 102 డాలర్లకు చేరుకుందని గణాంకాలు చెప్తున్నాయి. ఈ ధరల పెరుగుదలతో మనదేశంలో లీటరు పెట్రోలు ధర 125 రూపాయల దాకా పెరగొచ్చని కొందరంటున్నా, పెరుగుతున్న యుద్ధవాతావరణం నేపథ్యంలో కనీసం 40 నుంచి 50 రూపాయల దాకా ధరలు పెరిగినా ఆశ్చర్యపడనక్కర లేదని మరికొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. పెట్రో ధరలు పెరిగితే ఇతరత్రా నిత్యావసర సరుకుల మీద కూడా ఆ ప్రభావం తప్పకుండా ఉంటుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో పెరగనున్న పెట్రో ధరలు ప్రజలపై పెనుభారం కాకుండా కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే!..

# మూడు రాజధానులకు హైకోర్టు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)



తీర్పును స్వాగతిస్తూ... హైకోర్టు ఎదుట సాష్టాంగ ప్రణామం చేస్తున్న అమరావతి రైతులు


అమరావతి నుంచి ఒక అంగుళం కూడా అటూ, ఇటూ కదలకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు బిగించింది. సిఆర్‌డిఏ చట్టాన్ని అమలు పరచాల్సిందేనని, రాజధాని భూములను వేరే ప్రయోజనాలకు వాడకూడదని, భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా అభివృద్ధి చేసిన స్థలాలు అప్పచెప్పాలని, భూమి ఇచ్చిన ప్రతి రైతుకూ 50 వేల రూపాయల వంతున 'నష్ట పరిహారం' చెల్లించాలని కూడా ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 3వతేదీ ఉదయం తొలిగడియలోనే ఈ చేదువార్త వైసీపీ శ్రేణుల చెవిలో పడింది.

ప్రభుత్వ అభీష్టానికి పూర్తి వ్యతిరేకంగా తీర్పును ఇవ్వడమే కాకుండా ఆ తీర్పును అమలు చేస్తున్న విధానంపై ప్రతి నెలా న్యాయస్థానానికి నివేదిక సమర్పించాలని కూడా హైకోర్టు ప్రభుత్వాన్ని కోరడం ఆ పార్టీవర్గాలకి, ప్రభుత్వ పెద్దలకి మింగుడు పడడం లేదు. విశాఖకు రాజధానిని తరలించాలనే ప్రభుత్వ ఆలోచనకి ఇక ప్రస్తుతానికి బ్రేకులు పడినట్లే. ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయక తప్పని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం పడిపోయింది. అటు భూములను, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు, 20 వేల మంది రైతులకు ఒక్కొక్కరికీ 50 వేల 'నష్ట పరిహారం' చెల్లించాలన్న అంశం కూడా ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పే. ఇవన్నీ ఆరు నెలల్లోపు పూర్తిచేయాలని కూడా కోర్టు ఆదేశించింది.

అయితే, అంత ఆర్థిక వెసులుబాటు ప్రభుత్వానికి లేదన్నది బహిరంగ రహస్యం. కోర్టు తీర్పును కోర్టు ఆదేశించిన రీతిలో అమలుచేయకపోతే 'కోర్టు ధిక్కారణ' నేరాన్ని ఎదుర్కొనవలసి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులలో సుప్రీంకోర్టును ఆశ్రయించడమే ప్రభుత్వం ముందున్న ఏకైక మార్గం అని వైసీపీ వర్గాలు అంతర్గతంగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పందన ఏమిటన్నది తెలియాల్సివుంది. కానీ, ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేయడం ఖాయమని మాత్రం వైసీపీవర్గాలు పేర్కొంటున్నాయి.

# పొంచి ఉన్న ముప్పు

- బంగాళాఖాతంలో మళ్ళీ అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు
- నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలు అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు



బంగాళాఖాతంలో మళ్ళీ అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడనం వచ్చే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉన్నట్లు ఈనెల 3వ తేదీ గురువారం నాడు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ.. తమిళనాడు తీరానికి దగ్గరగా వచ్చే అవకాశాలున్నాయని, అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 4వ తేదీ నుంచి రాయలసీమ, కోస్తాంధ్ర తీరాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. తీరం వెంబడి 45–55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ముందస్తుగా సూచించారు. అత్యవసరమైతే తప్ప.. ఇళ్ళల్లో నుంచి బయటకు రావద్దని తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని పేర్కొన్నారు. ఇప్పటికే సముద్రం లోపలకు వేటకు వెళ్లిన వారు వీలైనంత త్వరగా తీరానికి చేరుకోవాలని సూచించారు. గత ఏడాది నవంబర్‌లో వానలు, వరదలవల్ల భారీనష్టాలు సంభవించిన నేపథ్యంలో ఇప్పుడు పొంచి ఉన్న వాయుగుండం ముప్పు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# గౌతమ్‌కి ఘ(జ)న నివాళి







అయిదు పదుల వయసులోనే గుండెపోటుతో ఆకస్మికంగా అసువులుబాసిన ఆంధ్రా మంత్రి, ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి గౌతమ్‌రెడ్డి దశదిన కర్మక్రతువులు మార్చి 3వతేదీ గురువారం ఉదయం ఉదయగిరిలోని మేకపాటి కుటుంబానికి చెందిన మెరిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగాయి. గౌతమ్ కుమారుడు కృష్ణార్జునరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాడు. మేకపాటి గౌతమ్ స్మారకాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మరోవైపు భారీవేదికను నిర్మించి మధ్యలో ఆయన చిత్రపటం ఉంచారు. వేదికకు అటు ఇటు ఎల్‌ఈడి స్క్రీన్‌లను అమర్చి గౌతమ్‌రెడ్డికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. వందల సంఖ్యలో మేకపాటి బంధుమిత్రులతో పాటు అనేక మంది రాష్ట్ర మంత్రులు, సలహాదారులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పారిశ్రామిక ప్రముఖులు, అధికార అనధికార ప్రముఖులు పాల్గొని నివాళు లర్పించారు. వేల సంఖ్యలో మేకపాటి కుటుంబ అనుచరులు, ప్రజలు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని తమ యువ నాయకుడిని స్మరించుకున్నారు. తమ నాయకుడి స్మృత్యంజలి కార్యక్రమానికి విశేషంగా కదలివచ్చిన వైసీపీ పార్టీ శ్రేణులు, మేకపాటి అభిమానులతో ఉదయగిరి దారులన్నీ నిండిపోయాయి. చిన్న వయసులోనే ఇంతమంది అభిమానాన్ని సొంతం చేసుకుని వెళ్లిపోయిన గౌతమ్‌రెడ్డి పుణ్యజీవే కాదు ధన్యజీవి కూడా.

# 'ప్రభా'తం


కరోనా..మాయదారి మహమ్మారి వ్యాధి ఇంకా పూర్తిస్థాయిలో తగ్గలేదు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 లక్షల మంది దాకా అమాయక ప్రజలను ఈ రాకాసి మింగేసింది. అయినా ఇంకా దాని మృత్యుదాహం తీరడం లేదు. నిమ్మళంగా ఉంటూనే..చాపకింద నీరులా.. భయంకర విషనాగులా నేటికీ మానవాళిని కాటేస్తూనే ఉంది. మార్చి 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు అందిన సమాచారం ప్రకారం ప్రపంచంలోని 59,85,985 మంది ప్రజలు కరోనా కరకు కోరలకు బలైపోయారు. రోజా పెరుగుతున్న మృతుల సంఖ్యను బట్టి చూస్తే ఇక రేపోమాపో ఆ సంఖ్య 60 లక్షల సంఖ్య దాటేయడం ఖాయమని వేరే చెప్పనక్కర లేదు.

కరోనా తగ్గిపోయిందిలే అని అందరూ అనుకుంటున్నా అది పూర్తిస్థాయిలో తగ్గేదెప్పుడో తెలియదు కానీ, మానవాళిపై దాని కర్కశత్వం ఎంత బలంగా ఉందో చూస్తుంటే దీని ఉధృతి ఇక ఎప్పటికి తగ్గుతుందో అంచనాకు కూడా అందడం లేదు. అయితే, గతంలో కంటే కరోనా ఉధృతి బాగానే తగ్గిపోయిందనడంలో సందేహం లేదు. కానీ కరోనాని నమ్మడానికి లేదని వైద్యనిపుణులే చెప్తున్నారు. అందుకు తగ్గట్టుగానే అది నిత్యం ఎంతోమందిని నేటికీ పొట్టనపెట్టుకుంటూనే ఉంది. ప్రపంచదేశాల్లో కరోనా కొత్తకేసులు అనునిత్యం కలవరపెడుతూనే ఉన్నాయి. రోజా కనీసం అయిదు లక్షలకు తగ్గకుండా కొత్తకేసులు వస్తుండడం ఆందోళన కలిగిస్తూనే ఉంది. మార్చి 2 నాటికి ప్రపంచంలో కరోనా బాధితుల సంఖ్య 43 కోట్లా 89 లక్షలా 85వేలా 541 దాకా ఉందంటే కేసుల సంఖ్య ఎంత గణనీయంగా ఉందో అర్థమవుతుంది. వీరిలో 59.85 లక్షల మందిదాకా ఇప్పటికే మృత్యువాతపడ్డారు. ఇంకా 74,653 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. అయితే వైద్యుల పుణ్యమా అంటూ దాదాపు 36.91 కోట్ల మంది దాకా కరోనా కోరల నుంచి బతికి బయటపడ్డారు. ఇంకా 6.24 కోట్లమందికి పైగా బాధితులు కోవిడ్ వైరస్‌తో అనుక్షణం బాధలు పడుతూనే ఉన్నారు.

కరోనా విరుచుకుపడుతున్నప్పటి నుంచి ప్రపంచదేశాలకు కంటికి నిదురే ఉండడం లేదు. తగ్గినట్లే తగ్గి మళ్ళీ విజృంభించి తన ప్రతాపం చూపుతున్న ఈ వ్యాధిని నివారించేందుకు ఎన్నెన్నో రకాల మందులు, చికిత్సలు, వ్యాక్సిన్‌లు శరవేగంగా వస్తూనే ఉన్నాయి. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్నంతా ఉపయోగించి దానిని నిర్మూలించడానికి అన్ని దేశాల్లో ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు అహరహం శ్రమిస్తూనే ఉన్నాయి. దీంతో కోట్లాదిమంది ప్రజలను ఆ విషపువ్యాధి బారిన పడకుండా కాపాడగలిగారు కూడా. అదొక పెద్ద విజయమే. అయితే, కంటికి కనిపించని ఆ సూక్ష్మక్రిమి రకరకాలుగా రూపాలు మార్చుకుంటూ రకరకాల వేరియంట్ల వేషాలతో జొరబడి మానవాళిని ఇంకా కబళిస్తూనే ఉంది. కంటికి కనిపించకుండానే మారణహోమం సృష్టిస్తున్న ఈ రాకాసిని ఎలా నిలువరించాలో చేయాల్సిన అన్ని ప్రయత్నాలు శాస్త్రవేత్తలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడెంతో మేలు!..అనేకదేశాల్లో దీని ఉధృతిని బాగా నివారించగలిగారు. మనదేశంలోనూ ఇది బాగా తగ్గుతూ ఉంది. అట్లని..పూర్తిగా తగ్గిపోయిందని అనుకోవడానికి లేదు. ప్రతిరోజూ ఎన్నోకొన్ని కరోనా కేసులు వస్తూనే ఉన్నాయి. మరణాలు కూడా కొద్దోగొప్పో నమోదవుతూనే ఉన్నాయి. వేలల్లో ఉన్న మరణాలు వందల్లోకి వచ్చాయి. ప్రభుత్వాలు తీసుకుంటున్న కోవిడ్ నివారణ చర్యలతోనే సత్ఫలితాలొస్తున్నాయి. దేశంలో ఇప్పటికి ఈ వ్యాధికి గురైన వారి సంఖ్య 4.29 కోట్లకు పైగా ఉండగా, అందులో 4.23 కోట్లమంది కోలుకున్నారంటే చిన్నవిషయమేమీ కాదు. అందుకు అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రాణాలకు తెగించి బాధితులను కాపాడుతున్న వైద్యులను అభినందించి తీరాల్సిందే. ప్రభుత్వాల అప్రమత్తత, వైద్యసిబ్బంది సేవల ఫలితంగా దేశంలో కరోనా మరణాల సంఖ్య ఇప్పుడు బాగా తగ్గిందనే చెప్పాలి. కొంతమందికి కొత్తగా కరోనా వచ్చినా కొద్దిరోజులకే తగ్గిపోతోంది. వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల ఎంతోమందికి ప్రాణహాని తప్పింది. కానీ, పూర్తిస్థాయిలో కరోనా నిర్మూలన కావాలంటే ఇంకెంత కాలం పడుతుందో చెప్పలేం. ఇది ఇక్కడితో ఇలా తగ్గిపోతూ చివరికి కనుమరుగైపోతుందా?.. లేక మళ్ళీ హఠాత్తుగా మరోరూపంతో గాండ్రిస్తుందా?.. తెలియదు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధి మానవాళిని ఇంకా భయపెడుతూనే ఉంది.

మనదేశంలో ఈ వ్యాధికి 5 లక్షలా 14 వేల మందికి పైగానే ఈ వ్యాధికి బలైపోయారు. నేటికీ 92 వేల మందికి పైగానే కరోనా బాధితులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. కాబట్టి కరోనా విషయంలో ఇంకా జాగ్రత్తగా ఉండాల్సిందే. తగ్గిపోయిందిలే.. ఇక ఏమీ కాదులే.. అనుకోవడానికి లేదు. కరోనా రాకాసిని అసలు నమ్మడానికి వీల్లేదు. వ్యాధి వచ్చిన తర్వాత నానా యాతనలు పడేకంటే, దానికి దూరంగా ఉండడమే మంచిది. అందువల్ల కరోనా పోయిందిలే అనుకోకుండా.. ఎప్పటికప్పుడు కరోనాకి సంబంధించి వైద్యపరీక్షలు చేసుకోవడం, టీకాలు వేసుకోవడం, ప్రభుత్వాలు సూచిస్తున్న నియమ నిబంధనలు పాటించడం, మాస్కులు ధరించడం, జనంలో తిరిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం వంటివన్నీ ఎంతో ముఖ్యం. ఒక్క మనదేశమే కాదు.. ప్రపంచదేశాలన్నీ కూడా ఈ వ్యాధి పట్ల మునుపటికంటే జాగ్రత్తగానే ఉండాలి. మానవాళిని కబళిస్తున్న ఆ మహమ్మారిని పూర్తిస్థాయిలో తరిమికొట్టాలి. అప్పటిదాకా.. ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకుండా..ఎవరికి వారు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి. దానికి దొరక్కుండా అన్ని జాగ్రత్తలు పాటించాలి. కరోనా కోరలకు మనం దొరకకపోవడమే దానికి మరణశిక్ష!... దానికి దూరంగా ఉండడమే మనకు శ్రీరామరక్ష!...

## 60 లక్షల మందిని మింగేసింది



కరోనా.. మాయదారి మహమ్మారి వ్యాధి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికి దాదాపు 60 లక్షల మంది దాకా అమాయక ప్రజలను మింగేసింది. అయినా నేటికీ దాని మృత్యుదాహం తీరడం లేదు. చాపకింద నీరులా ఉంటూ మానవాళిని కాటేస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇంకా కరోనా కేసులు వస్తూనే ఉన్నాయి. మరణాలు కూడా నమోదవుతూనే ఉన్నాయి. అందువల్ల కరోనా పోయిందిలే అనుకోకుండా.. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేసుకోవడం, టీకాలు వేసుకోవడం, ప్రభుత్వాలు సూచిస్తున్న నియమ నిబంధనలు పాటించడం అవసరం. ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకుంటూ.. దాని కోరలకు దొరకకపోవడమే.. దానికి మరణశిక్ష!... దానికి దూరంగా ఉండడమే మనకు శ్రీరామరక్ష!...

---



## భద్రాచలంలో 'శ్రీ సీతారామ కల్యాణం' గ్రంథావిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ రామాంకితంగా రచించిన శ్రీ సీతారామ కల్యాణం (శ్రీమద్రామాయణం-బాలకాండ-పద్యసప్తశతి-గ్రంథత్రయం) గ్రంథానికి గతనెల 28న భద్రాచలంలోని శ్రీ జీయర్ మఠంలో ఆవిష్కరణ జరిగింది. భావనాప్రియ (భద్రగిరి-ధ్రువకోకిల) సాహిత్యబృందం, పద్య సారస్వత పీఠం-తెలంగాణ, భద్రాచలం శ్రీ జీయర్ మఠం వారి సంయుక్త నిర్వహణలో నెల్లూరు జిల్లా ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీహరితీర్థస్వామి వారి శుభాశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథావిష్కరణ సభలో అథర్వ వేద పండితులు జి.మురళీకృష్ణమాచార్యులు శ్లోక-పద్యభావ-పద్య గ్రంథాన్ని, ఆచార్య తంబిశెట్టి రామకృష్ణ పద్య గ్రంథాన్ని, స్థానాచార్యులు కెఇ స్థలశాయి వచన గ్రంథాన్ని, మరుమాముల దత్తాత్రేయశర్మ ఆడియో సీడీని, సమస్యా పృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య వీడియో సీడీని ఆవిష్కరింపగా, వ్యాసమహాభారత అనువాదకులు డా. సూరం శ్రీనివాసులు, అవధాన కళానిధి ఆముదాల మురళి, నారుమంచి అనంతకృష్ణ గ్రంథసమీక్ష చేశారు. వాల్మీకి మహర్షి విరచించిన శ్రీమద్రామాయణంలోని బాలకాండ శ్లోకాలకు చక్కనైన పద్యానువాదాన్ని, వచనానువాదాన్ని చేసిన అవధాని కోట రాజశేఖర్ ఆంధ్రవాల్మీకి బిరుదాంచితులైన వావిలికొలను సుబ్బారావు మార్గాన్ని అనుసరించారని, పద్య రచన మనోహరంగా సాగిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమ రూపకల్పనకు విశేషకృషి చేసిన సంగీత కళానిధి నల్లాంచక్రవర్తుల చక్రవర్తి సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. అవుసుల భానుప్రకాశ్ సభను చక్కగా నిర్వహించారు. కవర్ డిజైనర్ విట్టుబాబు సహకరించారు. అనంతరం అందరి కరతాళధ్వనుల మధ్య అవధాని కోట రాజశేఖర్‌ను ఆచార్యులందరూ ఘనంగా సత్కరించారు. 'శ్రీరాముని దయచేతను'.. ఈ గ్రంథరచన సాగిందని, రామాంకితమైన గ్రంథత్రయాన్ని రామభక్తులు అడవికొలను వెంకట్ (యుఎస్ఏ) ఆర్థికసాయంతో ముద్రించి భద్రాద్రిరామునికి సమర్పించి ధన్యుడనయ్యానని గ్రంథకర్త అవధాని కోట రాజశేఖర్ తన స్పందనలో వివరించి అందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు.

## మురుగునీటితో పెన్నమ్మ కలుషితమైపోతోంది

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

పెన్నానది ఎంతో పవిత్రమైనది. ఈ నదీ తీరాల్లోనే రంగనాథస్వామి, జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలున్నాయి. నిత్యం ఎంతో మంది భక్తులు వచ్చి పెన్నానదిలో స్నానం చేసి ఆ తర్వాత ఆ దేవాలయాలను దర్శించుకుంటూ ఉంటారు. అయితే, నెల్లూరు రంగనాయకులపేట వద్ద ఉన్న నదీప్రాంతం, అదేవిధంగా జొన్నవాడ దేవాలయం వద్ద ఉన్న నదీ ప్రాంతాలన్నీ మురుగుమయంగా ఉంటున్నాయి. దుర్గంధభరితంగా ఉన్న ఈ ప్రాంతాల్లో భక్తులు స్నానం చేయాలంటే ఎంతో బాధ పడుతున్నారు కూడా. చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లోంచి చెత్తాచెదారం, మురుగు నీళ్ళు నదిలోకి వచ్చి కలుస్తుండడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. పవిత్రమైన నదులు కలుషితమైపోతుండడం మన దురదృష్టం. ఇకనైనా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు శ్రద్ధ తీసుకోవాలి. భక్తులు ఎంతెంతో దూరాల నుంచి ఇక్కడికి వచ్చి భక్తితో స్నానమాచరించడానికి నదిలోకి దిగితే అంతా దుర్గంధంగా ఉండడం ఎంత బాధాకరమో కదా!.. ఇకనైనా స్నానఘట్టాల్లోకి, నదిలోకి మురుగునీరు పోకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేసేలా అధికారులు, ఆలయాల సిబ్బంది కలసి చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా భక్తులు కూడా నదీ ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు తాము తిన్న పదార్థాలను, లేదా వ్యర్థాలను నదిలో వేయకుండా పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా స్నానఘట్టాలు ఉన్న ప్రాంతాల్లో కూడా ఆలయాల అధికారులు అన్నిచోట్లా చెత్తకుండీలు ఏర్పాటుచేయాలి. సందర్శకులు చెత్తాచెదారం ఎక్కడంటే అక్కడ వేయకుండా చూడాలి. పరిశుభ్రతపై స్థానికులకు, సందర్శకులకు అవగాహన కలిగేలా విరివిగా పోస్టర్లను వెలువరించాలి. పరిశుభ్రత గురించి మైకుల ద్వారా చెప్పించాలి. ఆలయాల ప్రాంతాల్లో ఎక్కడంటే అక్కడ చెత్తను వేయకూడదని బోర్డులు కూడా పెట్టాలి. నదీప్రాంతాలు, దేవాలయాలున్న ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడకుండా అధికారులు, ఆయా ప్రాంతాల్లోని ఆలయాల సిబ్బంది దృష్టి సారించి ఆలయాల పరిశుభ్రతకు బాటలు వేయాలని మనవి. మరో విషయం.. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దైవదర్శనానికి ముందుగా చకచకా నదిలోకి వెళ్ళి స్నానమాచరించాలనుకోవడం సహజం. వాళ్ళకి నీళ్ళల్లో ఎక్కడ గుంటలుంటాయో తెలియదు. అందువల్ల గుంటలు, సుడిగుండాలున్న ప్రాంతాలేమైనా ఉంటే, అక్కడ ఎవరూ స్నానాలకు దిగరాదంటూ హెచ్చరిక బోర్డులు కూడా పెట్టడం అవసరం.

**- ఆర్‌కె గంగాధర్, బుచ్చిరెడ్డిపాలెం.**

## మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరుస్తుండాలి

జిల్లాలో అనేక మంచి నీటి ట్యాంక్‌లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని రక్షిత పథకాల స్థితిగతులను ఎవరూ పెద్దగా పట్టించుకోకపోతుండడంతో చాలాచోట్ల అవి మురికిగానే ఉంటున్నాయి. గ్రామాల్లో పెద్దపెద్ద ట్యాంకులు ఉన్నా, వాటిని తరచూ పరిశుభ్రం చేయకపోతుండడం వల్ల సమస్యలు వస్తున్నాయి. కొన్నిచోట్ల పాతబడి, మరమ్మతులకు గురైన నీళ్ళ ట్యాంకులు కూడా ఉంటాయి. వాటిని గుర్తించి బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా నిర్ణీత సమయంలో మంచినీళ్ళ ట్యాంకులను పరిశుభ్రం చేసేందుకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించాలి. మంచినీళ్ళ ట్యాంకుల పైభాగంలో ఎక్కువగా పక్షులు, కోతులు ఉంటుంటాయి. వాటి ద్వారా కూడా ట్యాంకుల్లో నీళ్ళు కలుషితం అయ్యే అవకాశం ఉంటుంది. అదేవిధంగా గ్రామాల్లో, పట్టణాల్లో కూడా అనేకప్రాంతాల్లో మంచినీటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదు. అసలే వేసవి కాలం వస్తోంది. కుళాయిలు సరిగా లేకపోతే నీళ్ళకి ఇబ్బంది. కనుక జిల్లాలో వాటి పరిస్థితిని కూడా ఒకసారి అధికారులు గమనించాలి. వాటిని బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలి.

**- పి.బాలసరస్వతి, కావలి.**

# అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయండి

## - అధికారుల సమావేశంలో మంత్రి అనిల్



నెల్లూరు నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డా. పి. అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. ఈ నెల 2న నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, పబ్లిక్‌హెల్త్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జగనన్న కాలనీలలో పేదలందరికీ ఇళ్ల నిర్మాణంపై పలు సూచనలు చేశారు. నగరంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించాలని, నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాడు-నేడు కింద జరుగుతున్న బివిఎస్ బాలికల హైస్కూల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, పబ్లిక్‌హెల్త్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## వెంకటగిరిని
# డివిజన్ కేంద్రం చేయండి

## - కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వినతి

వెంకటగిరి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేస్తే శ్రీబాలాజీ జిల్లాతో వెంకటగిరి ప్రాంతాలకు పరిపాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మార్చి 1న ఆయన పలు మండలాల ప్రజాప్రతినిధులతో నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో ఉన్న కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనం మాట్లాడుతూ ఉత్తర దక్షిణ ధృవాలుగా ఉన్న ప్రస్తుత ప్రతిపాదిత నూతన జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల అసంబద్ధ ప్రతిపాదనతో అనేక పరిపాలనా పరమైన ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగుతాయని, ఆ విషయాలను ప్రభుత్వం దృష్టికి వచ్చేలా నివేదించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రతిపాదిత శ్రీ బాలాజీ జిల్లా.. నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి, మునిసిపాలిటీ, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండల ప్రజలకు ఆమోదయోగ్యం అయినప్పటికీ నూతన వెంకటగిరి డివిజన్ ఏర్పాటు అత్యంత ఆవశ్యకరమన్నారు.

# గ్రంథాలయ సంస్థకు పూర్వవైభవం తెస్తాం

## - చైర్‌పర్సన్ దొంతు శారద



విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను బలోపేతం చేయడం ద్వారా జిల్లా గ్రంథాలయ సంస్థకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఆ సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి దొంతు శారద చెప్పారు. ఈనెల 2న నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో పుస్తక ఎంపిక కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నూతనంగా కొత్తగా కొనుగోలు చేయనున్న పుస్తకాలను పరిశీలించి అన్ని వర్గాల పాఠకులకు ఉపయోగపడే విధంగా 2021-22 సంవత్సరానికి గాను 79 లక్షల రూపాయల విలువగల పుస్తకాలను ఎంపిక చేశారు. వీటిని కలకత్తాలోని రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ వారి నుండి డిస్కౌంట్ ధరలకు తెప్పించాలని తీర్మానించారు. 2022-23 సంవత్సరానికి గాను సైటేషన్ నంబర్లు లేని తాజా పుస్తకాలు కొనుగోలు చేసేందుకు 20 లక్షల రూపాయలు కేటాయించారు.

### భవన నిర్మాణాల కోసం 98.50 లక్షలు :

జిల్లాలో గ్రంథాలయాల భవనాల కోసం 98.50లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయం కోసం 50 లక్షల రూపాయలు, కోవూరు గ్రంథాలయం కోసం 20 లక్షల రూపాయలు, జలదంకి గ్రంథాలయం కోసం28.50 లక్షలు రూపాయలు వ్యయం చేయనున్నామన్నారు. అలాగే ప్రతి గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్లు అంతర్జాల సౌకర్యంతో ఏర్పాటు చేసేందుకు 50 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నామన్నారు. అలాగే సమకాలీన అంశాలకు సంబంధించిన డిజిటల్ కాపీలను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాల కళాశాలలకు వెళ్లి జీవన శైలి ఎలా ఉండాలి, వ్యక్తిత్వ వికాసం ఎలా పెంపొందించుకోవాలి, విజయతీరాలకు ఎలా చేరుకోవాలి, ఆత్మవిశ్వాసంతో ఎలా మెలగాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించి గ్రంథాలయాల పట్ల మొగ్గుచూపే విధంగా ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ సహకారం కోరనున్నామని చెప్పారు. ముఖ్యంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ల వ్యవస్థను వినియోగించుకోనున్నామన్నారు. అంతేకాకుండా కోళ్లపారం, ప్రయోగశాల, నర్సింగ్ తదితర ఒకేషనల్ కోర్సులకు అవసరమైన పుస్తకాలను కూడా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సిహెచ్ ప్రసాద్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉపసంచాలకులు ఎం.వెంకటేశ్వరప్రసాద్, డీకే డబ్ల్యూ ప్రభుత్వ కళాశాల తెలుగు, రాజకీయ శాస్త్రం, జంతుశాస్త్రం లెక్చరర్లు డాక్టర్ కరుణశ్రీ, కే.జోజి, డాక్టర్ ఎన్ అనిత, గూడూరు ఎస్‌కే ఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల చరిత్ర లెక్చరర్ డాక్టర్ జి సురేంద్ర పాల్గొన్నారు.

# శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు



శ్రీసిటీలో గత నెల 26 నుంచి 51వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ ఈ కార్యక్రమానికి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీసిటీ సిబ్బందికి, స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి, వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డుప్రమాదాలు, ఇతరత్రా ప్రమాదాలను నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈ భద్రతా వారోత్సవాల లక్ష్యమని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనిచేస్తున్న ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తుంటాయని, వాటిని నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమలు కలిసి తరచూ తమ ఉద్యోగులు, కార్మికులకు భద్రత పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భద్రతా వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని, శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌లో ఉన్న జిల్లా వాసులను ఆదుకుంటాం

ఉక్రెయిన్ పై రష్యా మిలిటరీ ఆపరేషన్ నేపథ్యంలో వృత్తి, విద్య రీత్యా ఉక్రెయిన్‌లో ఉంటున్న భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, మనరాష్ట్రానికి సంబంధించి ఢిల్లీలోని ఏపి భవన్‌లో అందుకోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాకు సంబంధించి ఎవరైనా వృత్తి, విద్య రీత్యా ఉక్రెయిన్‌లో ఉన్న వారి కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తులను ఏపీ భవన్‌లోని ప్రత్యేకసెల్‌కు పంపి వారిని ఉక్రెయిన్ నుంచి సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఢిల్లీకి పంపామని కలెక్టర్ తెలిపారు. నెల్లూరుజిల్లాకు చెందిన 26 మంది విద్యార్థులు ఉక్రెయిన్‌లో ఉన్నట్లు జిల్లా అధికారులు గుర్తించారని, వారి పాస్‌పోర్టు వివరాలు, తదితర అంశాలను సేకరించి రాష్ట్రప్రభుత్వం ద్వారా భారత రాయబార కార్యాలయానికి పంపించామని తెలిపారు.

### ఉక్రెయిన్ నుంచి సురక్షితంగా...

ఉక్రెయిన్ నుంచి కావలికి చెందిన విద్యార్థిని దార్ల బ్యూలా ఈనెల1న కావలికి చేరుకుంది. తల్లితండ్రులను కలిసి భావోద్వేగంతో కన్నీరు పెట్టుకుంది. ఉక్రెయిన్‌లో రష్యా దాడుల నేపథ్యంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కేంద్రప్రభుత్వం, రాయబార కార్యాలయం సహకారంతో ఎంతో కష్టపడి బయటపడ్డామని ఆ విద్యార్థిని పేర్కొంది. ఉక్రెయిన్ నుంచి రుమేనియాకు వచ్చి అక్కడి నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఇల్లు చేరామని వివరించింది. అదేవిధంగా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సిహెచ్ లిఖిత్ కూడా ఉక్రెయిన్ నుంచి తిరిగి స్వస్థలానికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు.

### మీ సహకారం మరువలేనిది! - చైతన్య

ఉక్రెయిన్ నుంచి నెల్లూరుకు చేరుకున్న ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థి కె. చైతన్య ఈనెల 1న నెల్లూరుకు చేరుకుని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కలిసి తనను సురక్షితంగా తీసుకువచ్చినందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. ఉక్రెయిన్ సరిహద్దుల్లో రెండురోజులపాటు తలదాచుకుని రుమేనియాకు వచ్చి అక్కడ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో స్వదేశానికి తిరిగి వచ్చానని చైతన్య కలెక్టర్‌కు తెలిపారు. అందుకైన ఖర్చునంతా ప్రభుత్వమే భరించి తనను సొంత ఊరికి చేరేలా కృషి చేసినందుకు మీ సహకారం మరువలేనిదంటూ ఆ యువకుడు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




# 42,709 మందికి 'జగనన్న తోడు'

చిరువ్యాపారులకు అండగా రాష్ట్రప్రభుత్వం 'జగనన్న తోడు' పథకం మూడవ విడతలో 42,709 మందికి వడ్డీని ప్రభుత్వమే భరిస్తూ 10వేల రూపాయల వంతున రుణాలను అందజేసిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతనెల 28న ఆ మొత్తాన్ని చిరువ్యాపారుల ఖాతాల్లో జమచేశారని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈ సందర్భంగా సిఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని చిరువ్యాపారులకు ఈ పథకం కింద 42 కోట్లా 70 లక్షలా 90 వేల రూపాయలు లబ్ది చేకూరినట్లయిం దన్నారు. సకాలంలో రుణాలు చెల్లించినవారికి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ రోజ్‌మాండ్, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ఝాన్సీకి.. కలెక్టర్ ప్రశంస



రాష్ట్రస్థాయిలో సైన్స్‌ఫేర్‌కు ఎంపి కైన విద్యార్థిని ఝాన్సీని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అభినందించారు. నిడిగుంటపాళెం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఝాన్సీ గత ఏడాది డిసెంబర్‌లో వర్చువల్ విధానంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికకావడంతో ఇటీవల ఆ విద్యార్థినితో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు ప్రసాద్ నెల్లూరుకు వచ్చి కలెక్టర్‌ను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఝాన్సీకి ప్రశంసాపత్రం అంద జేసి అభినందించారు.

# అడిషనల్ పరీక్షల అధికారిగా మధుమతి



విక్రమసింహపురి విశ్వవిద్యాలయం సోషల్‌వర్క్ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ ఆర్.మధుమతి ఇటీవల అండర్ గ్రాడ్యుయేట్ సెక్షన్ అడిషనల్ పరీక్షల నియంత్రణ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మధుమతి మాట్లాడుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము కాకుండా కృషిచేస్తానని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడ తానని తెలిపారు. ఉపకులపతి ఆచార్య జి.యం.సుందరవల్లికి, రెక్టార్ ఆచార్య ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ డా ఎల్.విజయకృష్ణారెడ్డిలకు ఈ సందర్భంగా ఆమె తమ ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ ఆర్ ప్రభాకర్, డా. కోట నీలమణికంఠ, డా సిహెచ్.కిరణ్మయి ఇతర అధికారులు పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు.

# 'జనసేన'లో వందమంది చేరిక



జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ సారథ్యంలో ఇటీవల నెల్లూరు రూరల్ మండలంలోని వెంగళ్ రావునగర్ 33వ డివిజన్ నుంచి రాజు, శంకర్ ఆధ్వర్యంలో దాదాపు వంద మంది జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు గునుకుల కిషోర్, సుధీర్, ప్రశాంత్ గౌడ్, షాకీర్, బాలాజీ, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బిఐడి కళాశాలలో క్విజ్ పోటీలు



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 28న నెల్లూరు సంతపేటలో ఉన్న బిఐడి కళశాలలో విద్యార్థులకు సైన్స్ నమూనాల ప్రదర్శన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జపాన్‌లో శాస్త్రవేత్తగా ఉన్న హిమ అన్నపూర్ణ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామానాయుడు, అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు.

## నెల్లూరు కబుర్లు

### అసాంఘిక కార్యకలాపాలను...

# సహించేది లేదు

- ఆన్‌లైన్ బెట్టింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- పోలీసులను ఆదేశించిన ఎస్పీ విజయారావు



అసాంఘిక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, వాటిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 1న ఆయన పోలీసు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహణపై నిఘా పెట్టాలన్నారు. ప్రత్యేకించి ఐపిఎల్ క్రికెట్ నేపథ్యంలో బెట్టింగ్‌పై దృష్టిసారించాలన్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేస్తూ వాటిపై అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కా, హాన్స్, ఖైనీల అమ్మకాలను అరికట్టాలన్నారు. అక్రమరవాణాలకు చెక్ పెట్టేందుకు సెబ్ అధికారులతో కలిసి తనిఖీ కేంద్రాల వద్ద నిఘాపెట్టి వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100, లేదా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్ లేదా, 9704594540 నంబర్‌కు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చెప్పారు.

### దిశ డిఎస్పీగా సురేష్‌బాబు

దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్పీగా గుంటూరు జిల్లాకు చెందిన సురేష్‌బాబు గతనెల 28న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరుల్లో సిఐగా పనిచేసి ఉన్నారు. 2020లో డిఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ విజయారావును గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

# పెరసం ఆధ్వర్యంలో కవిత్వంలో శిక్షణ



నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఇటీవల బాలబాలికలకు కవిత్వంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. నగరంలోని జాషువా గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెరసం కార్యదర్శి అవ్వారు శ్రీధరబాబు సారథ్యంలో ఈ తరగతులు నిర్వహించగా, ప్రముఖ కవులు మోపూరు పెంచలనరసింహం, రవికుమార్, అంకబాబు, కవయిత్రులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, కవిత తదితరులు పాల్గొని సాహిత్యంలో పలు అంశాలపై బాలబాలికలకు అవగాహన కలిగించారు. అనంతరం నిర్వాహకులు బాలలకు కవితల పుస్తకాలను బహుమతిగా అందించారు.

### బాల బాలికలంతా తప్పనిసరిగా

# నులిపురుగుల మాత్రలు వేసుకోవాలి

జిల్లాలో 19 సంవత్సరాలలోపు ప్రతి ఒక్కరికి నులిపురుగుల మాత్రలను తప్పకుండా అందించాలని జిల్లా కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన తన చాంబర్లో నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మార్చి 2 తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేయడంతోపాటు వారికి ఆరోగ్య సంబంధమైన సమస్యలు ఏమైనా ఉంటే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బాల బాలికలకు ఆ మాత్రలు తప్పక వేయించేలా పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాల హాజరు పట్టికలోని ప్రతి ఒక్కరికి నులిపురుగుల మాత్రలు అందించాలన్నారు.



### 'నీట్' కౌన్సిలింగ్‌లో

# సత్తాచాటిన విశ్వసాయి విద్యార్థి

ఇటీవల జరిగిన 'నీట్' (ఎన్ఇఇటి) కౌన్సిలింగ్‌లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి కళాశాల విద్యార్థి ఏ.అర్జున్ ప్రతిష్టాత్మకమైన ఏఐఐఎంఎస్‌లో తన సత్తా చాటుతూ మంగళగిరిలో ఎంబిబిఎస్ సీటు సాధించాడని కళాశాల ఛైర్మెన్ డా.ఎన్. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆ విద్యార్థిని అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నతస్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ నీట్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు 120కి మందికిపైగా ఎంబిబిఎస్ సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# విఎస్‌యులో ఇద్దరు కొత్త డీన్‌లు



నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఇటీవల ఇద్దరు నూతన డీన్‌ల నియామకం జరిగింది. విఎస్‌యులో మెరైన్ బయాలజీలో పనిచేస్తున్న డాక్టర్ సిహెచ్ విజయ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా, బయోటెక్నాలజీ విభాగంలో పనిచేస్తున్న విజయానందకుమార్‌బాబు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్‌గా నియమితులయ్యారు. కొత్త డీన్‌లను విఎస్‌యు ఉపకులపతి జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డా.ఎల్ విజయ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్ తదితరులు అభినందించారు.

# డాక్టర్ బిందుమీనన్‌కు అరుదైన గౌరవం



నెల్లూరులోని అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్‌కు ఆరోగ్య సంరక్షణపై ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా అంతర్జాతీయ స్థాయి సంస్థ నుంచి విశేష గుర్తింపు లభించింది. గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియన్ అరిజన్ సంస్థ ఆమెకు 'అరిజన్ ఫెలో' అనే బిరుదును ప్రదానం చేసింది. గతనెల 27న అపోలో ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ పలువురు వైద్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను తెలియజేశారు. 'సామాన్యులకు ఆధునిక వైద్యం అందించడం' అనే అంశంపై ఆ సంస్థ ప్రపంచస్థాయిలో ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో పాల్గొన్న బిందుమీనన్‌కు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్‌తో పాటు పలువురు వైద్యులు అభినందించారు.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం..

# ప్రధానార్చకునికి సన్మానం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో గత 36 సంవత్సరాలుగా అర్చకునిగా, ప్రధాన అర్చకునిగా సేవలందించిన తంగిరాల రాధాకృష్ణయ్య గతనెల 28న ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాధాకృష్ణయ్య దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు. శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, ప్రముఖ దాత ఆల్లూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఇ.ఓ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొని రాధాకృష్ణయ్య సేవలను కొనియాడుతూ ఆయన్ను సన్మానించారు.

# ప్రసన్న వేంకటేశ్వరునికి.. కొత్త రథం సిద్ధం

• రానున్న బ్రహ్మోత్సవాలకల్లా అందుబాటులోకి

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసివున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి కొత్త రథం సిద్ధమైంది. రానున్న బ్రహ్మోత్సవాలకల్లా రథాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 1.10 కోట్లతో సర్వాంగ సుందరంగా రథాన్ని నిర్మించారు. రథానికి ప్రత్యేకపూజలు చేసి మంగళవాద్యాలతో, గోవింద నామస్మరణలతో గతనెల 28న ట్రయల్‌రన్ కూడా నిర్వహించారు. కావలి ఏఎంసి ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథం ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

రెండేళ్ళ క్రితం స్వామివారి రథం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతికావడంతో కొత్త రథం నిర్మాణాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే నిధులు మంజూరు చేయడంతో



కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి కొత్తరథం సిద్ధం చేసి ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు.

ఏడాదిన్నర కాలంలోనే రథం నిర్మాణం పూర్తయింది. ఈనెలలోనే జరగనున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు పూర్తిస్థాయిలో రథాన్ని సిద్ధం చేసేందుకు కృషి జరుగుతోంది.

## ఆలయం అభివృద్ధికి చర్యలు

**- దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్**

బిలకూట క్షేత్రాన్ని జిల్లాకే తలమానికంగా తీర్చిదిద్దుతామని, ఈ ఆలయం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ సుమారు 70 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను అమలుచేసేందుకు కృషిచేస్తామని దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, దాతల సహకారంతో చేపట్టనున్న పలు పనులకు పాలనాపరమైన అనుమతులిచ్చామన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, సర్పంచ్ గోపాల్, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



## మేకపాటి కుటుంబసభ్యులకు..

# ఎంపీ విపిఆర్ దంపతుల పరామర్శ

దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని, వారి కుటుంబసభ్యులను రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల పరామర్శించారు. తొలుత గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. మంత్రిగా గౌతమ్‌రెడ్డి రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. గౌతమ్‌రెడ్డి మరణం రాష్ట్రానికి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. గౌతమ్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని అన్నారు.

# ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



గండవరం ఆలయ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రసన్న

ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొడవలూరు నియోజకవర్గంలోని గండవరంలో వెలసివున్న గంగా పార్వతి సమేత శ్రీ ఉదయకాళేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆ ఆలయం పాలకవర్గ ఛైర్మన్‌గా బెల్లం వెంకయ్యనాయుడు, మరో ఆరుగురు సభ్యులు ప్రమాణస్వీకారోత్సవం చేయగా ఎమ్మెల్యే వారిని సన్మానించారు. భక్తిభావం ఉన్నవారికే ఆలయ పాలకమండళ్లలో చోటు కల్పించడం జరిగిందని, వారు స్థానికంగా ఉండే దాతలను సంప్రదించి ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఆయన కోరారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఓ నరసింహారావు, జొన్నవాడ ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, వైకాపా నాయకులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఒ.సునీత, గాలి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 7 నుంచి 20 దాకా..

# ఎన్‌బికెఆర్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కోట మండలంలోని విద్యానగర్ ఐఎస్‌టిలో మార్చి 7 నుంచి 20వ తేది దాకా జాతీయస్థాయి వ్యాయామ విద్య అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో ఏఐసిటిఇ సహకారంతో చేపట్టే ఈ కార్యక్రమంలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించిన వ్యాయామ అధ్యాపకులు అర్హులని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అర్హత సాధించినవారికి 14 రోజులపాటు సంప్రదాయ ఆటలు, సరదా ఆటలలో బృందాలుగా పాల్గొనడం, విద్యార్థులచేత వినోదాత్మకమైన ఆటలు ఆడించడం, క్రీడలకు సంబంధించి ఆధునిక నియమాలు, నిబంధనలు, సాంకేతికలతో నవీకరించడం జరుగుతాయని, దేశం మొత్తమ్మీద వచ్చిన దరఖాస్తులనుంచి అర్హత ఆధారంగా సుమారుగా 30 మంది అధ్యాపకులను ఈ కార్యక్రమానికి ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వారికి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల దాకా యోగ, కోలాటం, లేజిమ్స్, కర్రసాము, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా వ్యాయామ విద్యా విభాగానికి చెందిన నిష్ణాతులైన అధ్యాపకులతో క్రీడలకు సంబంధించిన తరగతులు నిర్వహించడం, సాయంత్రం 4 నుండి 6 గంటల దాకా ప్రత్యేక శిక్షకులతో ఆటల్లో కొత్తగా మారిన నిబంధనల గురించి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి 14 రోజుల పాటు భోజనం, వసతి సదుపాయంతో పాటు ట్రాక్ సూట్, టీ షర్ట్, స్పోర్ట్స్ షూస్ ఉచితంగా ఇస్తామన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి తదితరులు

పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో డైరెక్టర్‌తో పాటు కార్యక్రమ మూల్యాంకన కమిటీ సభ్యులు డా. జి.హరినాథ్‌రెడ్డి, డాక్టర్ సి.రవీంద్రరెడ్డి, ప్రొఫెసర్ ఎం.నటరాజ సురేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. కిషోర్, వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు శోభారాణి, రాముకుమార్, ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ డే వేడుకలు :



నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకుని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇటీవల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విద్యార్థుల మేధాశక్తిని పరీక్షించి వారికి ప్రతిభా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ మన దైనందిన జీవితంలో కీలకపాత్ర పోషిస్తోందని, సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదని చెప్పారు. 1928 ఫిబ్రవరి28న సర్ సివి రామన్ కనుగొన్న అంశాలు 'రామన్ ఎఫెక్ట్'గా పేరొందాయని, భౌతికశాస్త్రంలో సర్ సివి రామన్ ప్రయోగాల ద్వారా కనుగొన్న అంశాలు ఆధునిక ప్రపంచానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, 1930లో ఆయనకు నోబెల్ బహుమతి ప్రదానం కూడా జరిగిందన్నారు. మహనీయులైన అబ్దుల్‌కలాం, హోమి జె బాబా, సత్యేంద్రనాథ్ బోస్ వంటి శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా. ఎం.శ్రీనివాసులు, డా.పి. శ్రీహరిరెడ్డి, డా.వై.అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి లక్ష సాయం



విడవలూరు మండలం రామతీర్థం పాతూరు గ్రామానికి చెందిన నాయకుడు నెల్లూరు చెంచురత్నం కుమారుడు మురళి ఇటీవల ప్రమాదవశాత్తూ మిద్దెమీద నుండి పడి లేవలేని స్థితిలో చికిత్స పొందుతున్నాడన్న విషయం తెలిసి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఆయనను పరామర్శించారు. తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మురళికి వైద్య చికిత్సల కోసం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించి ఎమ్మెల్యే ప్రసన్న తన మానవత్వాన్ని చాటుకున్నారు.





లాయర్
విజయపథంలో నెల్లూరీయులు



కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే లేదా ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.
- మేనేజర్, సర్కులేషన్



నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.

# జగన్‌బాబు ఫోటోకి చంద్రబాబు దణ్ణాలు?



అవును. 'మనలో మాట'గా చెప్పుకోవాలి అంటే.. ముఖ్యమంత్రి జగనన్న ఫోటోకు మాజీ ముఖ్యమంత్రి చంద్రన్న రోజుకోసారైనా దణ్ణం పెట్టుకోవాలి. జగనన్న పాలన మొదలై నిండా మూడేళ్లు కూడా కాలేదు. అప్పుడే చంద్రబాబును రాజకీయంగా రెడీ చేసేశారు. జగనన్న ప్రభుత్వం పుణ్యమా అని చంద్రబాబునాయుడు కొత్త పెళ్ళికొడుకులా ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, 'ఆ ముహూర్తం' కోసం ఎదురు చూస్తున్నారు. 'అంతా జగనన్న చలవ...' అనుకుంటూ తెలుగుదేశీయులు మురిసిపోతున్నారు.


2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 175 స్థానాలకు గాను జగన్ పార్టీకి 151 స్థానాలు వచ్చాయి. రాష్ట్రంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అధికారులు ఆశ్చర్యచకితులయ్యారు. చివరకు ఈవీఎం మిషన్లు కూడా 'ప్రజాభిమాన' బరువును మోయలేక అన్నట్టుగా ఆశ్చరంతో నోళ్లు వెళ్ళబెట్టాయి... 'మరీ ఇన్ని సీట్లా' అనుకుంటూ. ఈ అంకెలు చూసి జగన్ కూడా ఆశ్చర్యపోయి ఉంటారు... 'ఏమిటీ వెల్లువెత్తిన ప్రజాభిమానం!!' అనుకుంటూ. 'ఆకాశం చిల్లు పడిందా... నేల ఈనిందా...' అనే ఎన్‌టీ రామారావు డైలాగ్‌ను గుర్తుకు తెస్తూ వైసీపీ సంప్రదాయ రాజకీయాలను నిలువునా చీల్చుకుంటూ అధికారంలోకి వచ్చేసింది.

ఎవరెవరో ఎం.ఎల్.ఏలు అయిపోయారు. ఎవరెవరో మంత్రులై పోయారు. ఎవరెవరో ఏదేదో అయిపోయారు. సంప్రదాయ రాజకీయం దిక్కూ మొక్కూ లేకుండా... ఏదేదో అయిపోయింది. 'ఇదిగో నవలోకం... వెలసే మనకోసం...' అన్నట్టుగా ఆంధ్రదేశం పులకించిపోయింది.

ఇవన్నీ చూసిన పరిశీలకుల కళ్ళు బైర్లుకమ్మాయి. వైసీపీకి మరో పాతికేళ్ల వరకు తిరుగులేదనే భావన సర్వే సర్వత్రా ఏర్పడిపోయింది.

'ఓహ్! నాయకుడు అంటే... జగన్ కదా నాయకుడు...' అంటూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు మురిసిపోయారు.

తెలుగుదేశం పార్టీ అయితే, జగన్ దెబ్బకు తుక్కుతుక్కయిపోయింది. 'ఇంకెక్కడి చంద్రబాబు! ఆయన పని అయిపోయిందనే విశ్లేషణలు పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. కుమారుడు లోకేష్ వల్లే చంద్రబాబుకు ఈ పరిస్థితి అనే ముక్తాయింపులూ విన్నాం. ఏదైతే ఏం...! వైసీపీ భీకర సునామీ దెబ్బకు, ఎండాకాలంలో కలుగుల్లో దూరిన కప్పల్లా... టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ గప్‌చిప్ అయిపోయాయి. ఎక్కడా సౌండ్ లేదు. రాష్ట్రంలో రాజకీయ మైదానంలో వైసీపీ ఒక్కటే మిగిలింది. అదే అధికార పక్షం... అదే ప్రతిపక్షం... అదే రిఫరీ, అదే ఈలలు వేసే ప్రేక్షకులు అన్నట్టుగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారి పోయింది. ఉద్యోగులు సంబరాలు చేసుకుంటూ వీధుల్లో డాన్సులు చేశారు.






- ఒక పక్కన రెండు అసెంబ్లీల(అంటే ఆంధ్ర, తెలంగాణ కలిపినా అని అర్థం)కు సరిపడేంత మెజారిటీ.
- మరో పక్క, అనూహ్య... అనితరసాధ్యమైన 'అయస్కాంత' ప్రజాదరణ ప్రజాకర్షణ. జగన్ ప్రభుత్వానికి అపారమైన గుడ్ విల్.
- 1956లో ఉమ్మడి తెలుగు రాష్ట్రం ఏర్పడిన తరువాత, ఏ ముఖ్యమంత్రికీ, ఏ పార్టీకి లభించని అపూర్వ రాజకీయ ఆదరణ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికి లభించింది. వై.ఎస్. అభిమానులు ఆనంద పారవశ్యంలో మునిగితేలారు. ఇదంతా 2019 నాటి ముచ్చట.

టిర్ర్...టిర్ర్...

టిర్ర్...టిర్ర్...

టిర్ర్...టిర్ర్

కాలచక్రంలో గిర్రుమని మూడేళ్ళ కాలం గడిచిపోయింది. ఇప్పుడు 2022.

తెలుగుదేశం పార్టీ మళ్లీ ఊపిరి పోసుకుంది. 'పోసుకుంది' కాదు. పోసేసుకుంది. చంద్రబాబు అయితే, 'మళ్లీ ముఖ్యమంత్రి హోదాలోనే ఈ అసెంబ్లీ భవనంలోకి అడుగుపెడతాను...' అంటూ భీషణ ప్రతిజ్ఞ చేసేంత స్థాయిలో... హిందీ నటుడు సల్మాన్‌ఖాన్ కండల ప్రదర్శన రేంజ్‌లో తెలుగుదేశం పార్టీ ఊగిపోతోంది..

'నేను మా నాన్నకుమల్లె మంచివాడిని కాదు. రేపు అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కరి సంగతి చూస్తా..' అని నారా లోకేష్ వైసీపీ నేతలపై కాలు దువ్వుతూ, బుసలు కొడుతున్నారు. పళ్ళు పటపట కొరుకుతున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలయితే అన్ని స్థాయిల్లోనూ క్రియాశీలకం అయిపోతున్నారు. క్షణాల వ్యవధిలో రోడ్ల మీదికి వచ్చేస్తున్నారు.

జగన్ వ్యతిరేక మీడియా అని జనం అనుకునే ఛానెళ్లు, పత్రికలకు ఆకాశమే హద్దుగా మారిపోయింది. (యాంటీ)సోషల్ మీడియా అయితే జగన్ వ్యతిరేక ప్రచార స్థాయి అసలు ఊహకే అందడం లేదు. ఏ ఊరు వెళ్లి, ఓ పదిమందిని పలకరించి చూద్దామనుకున్నా... ముగ్గురు నలుగురు కూడా జగన్ ప్రభుత్వంపై రెండు, మూడు మంచి మాటలయినా చెప్పడం లేదని అంటున్నారు. జగన్ ప్రభుత్వం కావాలి... చంద్రబాబు ప్రభుత్వం వద్దు అంటూ గత ఎన్నికల్లో శతవిధాలుగా ప్రయత్నించిన ఉద్యోగులయితే జగన్‌ను, ఆయన ప్రభుత్వాన్ని ఎన్నెన్ని మాటలన్నారో మొన్ననే చూశాం. వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, నిరుద్యోగులు, టీచర్లు, చివరకు... రోడ్ల మీద తిరిగే ఆవారాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని బాండీలో వేసి పేలాలు వేపుతున్నట్టు వేపుతున్నారని యూట్యూబ్ కాసేపు చూసే వారికి అనిపిస్తోంది.

ఇవన్నీ చూసుకుని టీడీపీయులు మరింతగా క్రియాశీలకం అయిపోతున్నారు. జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అంటున్నారు. చంద్రబాబే మళ్లీ ముఖ్యమంత్రి అనే ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేయడమే కాదు... నమ్ముతున్నారు కూడా.

ఇప్పుడు అసలు పాయింట్‌కి వద్దాం!

అసలు ఇలా ఎందుకు జరుగుతోంది? జగన్ వ్యతిరేక వాతావరణం ఇంత స్వల్ప వ్యవధిలోనే, ఇంత పెద్దఎత్తున ఎలా ఏర్పడింది? ప్రభుత్వ పెద్దలు వెనక్కి తిరిగి చూసుకుంటున్నారా? ఈ అంశాన్ని అధ్యయనం చేశారా?

- జగన్ ప్రభుత్వంపై టీడీపీ రోజువారీగా చేస్తున్న ఆరోపణల్లో ఎంతోకొంత నిజం ఉందంటూ జనం చర్చించుకుంటున్న విషయం గమనించారో... లేదో తెలియదు.
- తమను జగన్ ప్రభుత్వం నిలువునా అన్యాయం చేసిందని ఉద్యోగులూ, ఉపాధ్యాయులు చేస్తున్న అసంతృప్తిని ప్రభుత్వ పెద్దలు పరిగణనలోకి తీసుకోకపోతే ప్రమాదం. ప్రమాదం అనే విషయం గమనించారో.. లేదో తెలియదు.? వారి 'అసంతృప్తి' ఇప్పుడు బయట పడదు. ఏ రూపంలో ఎప్పుడు బయటపడాలో అప్పుడు బయటపడి, ఏమి చేయాలో అది చేస్తుంది.
- ప్రతిపక్షాలు వైసీపీపై చేస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలు జనంలో వైసీపీ ప్రతిష్టను దెబ్బ తీస్తున్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గమనించారో.. లేదో మరి !
- గుంపులు గుంపులుగా గెలిచిన శాసనసభ్యులు, ఎంపీలు క్షేత్రస్థాయిలో ఏమి చేస్తున్నారో చూస్తున్నారా?
- వారి వల్ల జగన్ పట్ల ప్రజలలో ఎటువంటి అభిప్రాయం కలుగుతున్నదో 'అధికార' పెద్దలు అంచనా వేస్తున్నారా?
- చంద్రబాబుకు రాజకీయ పునఃప్రాణ ప్రతిష్ట జరుగుతుందనే భావన రాష్ట్రంలో పెద్ద ఎత్తున కలగడానికి దారితీస్తున్న రాజకీయ కారణాలు ఏమిటి అనే విషయాన్ని వైసీపీ పెద్దలు ఎప్పుడైనా అధ్యయనం చేశారా?
- 2024 ఎన్నికల్లో వైసీపీ మళ్లీ 151 స్థానాలు గెలవగలదనే ఆశాభావంతో ప్రభుత్వ పెద్దలు ఉన్నారా?
- జగన్ గురించి, ఆయన పాలనా సామర్థ్యం గురించి ఏమీ తెలియని 2019లోనే 151సీట్లు వస్తే ఆయన పాలనా సామర్థ్యం, తీరుతెన్నులు, ప్రభుత్వ నిర్వహణ తీరు గురించి అవగాహన కలిగిన తరువాత వస్తున్న 2024 ఎన్నికల్లో 151 కంటే పైబడి సీట్లు లభించాలి కదా!
- క్షేత్రస్థాయిలో అటువంటి భావన ప్రజలలో కనబడుతుందా?

ఇటువంటి అనేక సందేహాలు, ప్రశ్నలను దృష్టిలో పెట్టుకునే ప్రయత్నం వైసీపీ పార్టీలో గానీ ప్రభుత్వంలో గానీ జరుగుతూ ఉందా అనేది తెలియడం లేదు. ప్రభుత్వం ఇప్పటిలాగానే పాలన కొనసాగించాలని... దాంతో, ముఖ్యమంత్రి పదవి ఈసారి చంద్రబాబును వరిస్తుందని టీడీపీయులు రోజుకోసారి దణ్ణం పెట్టుకుంటున్నారు. ఈ అంశాలను వైసీపీ పెద్దలు గమనంలోకి తీసుకున్నా సంతోషమే... తీసుకోకపోయినా సంతోషమే.

ఏవిషయానికైనా సంతోషించడమో... నిట్టూర్చడమో తప్ప, మనం చేయగలిగింది ఏముంది కనుక !?

ఈలోపు, పులి మీద పుట్రలా...

జగన్ ప్రతిష్టకు భంగం కలిగించగల.... రాష్ట్ర రాజకీయాలపై అమిత ప్రభావం చూపగల పలు ఘటనలు రాష్ట్ర ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మచ్చుకు వై.ఎస్.వివేకానందరెడ్డి మర్డర్ ఘటనలో సీబీఐ విచారణ ఒకటి. ఆ దర్యాప్తు లీకులు మరొకటి. ముందు ముందు ఈ కేసు ఎన్ని మలుపులు తిరుగుతుందోనన్న ఆసక్తి జనంలో నెలకొంది. ఇవన్నీ, జగన్ ప్రభుత్వంపై 'పబ్లిక్ పెర్సెప్షన్'కు దోహదం చేస్తాయి.

'అసలు వీటన్నిటితో మనకేం పని.? ఓటర్లకు ఏం కావాలో మాకు తెలుసు. మాకు ఏం కావాలో ఓటర్లకు తెలుసు. '2019 మోడల్' ఉందనే ఉంది కదా! 'పెర్సెప్షను, గిర్సెప్షన్‌తో పని లేదు....' అనే ఆలోచనలో వైసీపీ నేతలు ఉంటే ఈ ప్రశ్నలు, సందేహాలు, విమర్శలతో పని లేదు. సర్వే ఓటరూ సుఖినోభవంతు.!

**- భోగాది వేంకట రాయుడు**

bhogadirayudu2152@gmail.com

---

## గూడూరు డివిజన్ వార్తలు



### గూడూరును నెల్లూరులోనే ఉంచండంటూ

## పాశం రిలే నిరాహార దీక్ష

బాలాజీ జిల్లా వద్దు, గూడూరును నెల్లూరుజిల్లాలోనే ఉంచండి, లేకుంటే గూడూరును జిల్లా చేయండంటూ మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ నెల 1వ తేదీ గూడూరు టవర్‌క్లాక్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. టిడిపి నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయెల్‌కుమార్, వాటంబేటి శివకుమార్, కొండూరు వెంకటేశ్వర్‌రాజు, నిమ్మకాయల నర్సింహులు, సిపిఎం నాయకులు సివిఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణ చేశాం...



గూడూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న అభిప్రాయంపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఆర్డీఓ మురళీకృష్ణకు ఆమేరకు వినతిపత్రం సమర్పిస్తున్న గూడూరు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సిబ్బంది నాయకులు

## వైభవంగా మహాశివరాత్రి



గూడూరు పట్టణంలోని నరసింగరావుపేటలో బ్రహ్మకుమారిస్ వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. పుష్పాలు, మంచుగడ్డ తదితర వస్తువులతో చేసిన వివిధ రకాల శివలింగాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 1వ తేదీ ఉదయం జెండా ఆవిష్కరణ జరిగింది. సాయంత్రం మంచు శివలింగ దర్శనం జరిగింది. డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి తదితరులు మంచు శివలింగాన్ని దర్శించుకుని ఆ మహాదేవుని ఆశీస్సులు అందరికి లభించాలని కోరుకున్నారు. వై.గురునాథం, వాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు



గూడూరు త్యాగరాజవీధిలో శ్రీ కల్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఈ నెల 1వ తేదీ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర శతనామావళి పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# క్రీడల్లో విద్యుత్ ఉద్యోగుల ప్రతిభ

## క్యారమ్స్‌లో విన్నర్స్, హాకీలో రన్నర్స్



ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ టోర్నీలో నెల్లూరు విద్యుత్ శాఖ ఉద్యోగుల తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. మొత్తం 22 జట్లు పాల్గొంటే అందులో నెల్లూరుజిల్లా విద్యుత్‌శాఖ నుంచి పాల్గొన్న జట్టు ప్రథమస్థాయిలో నిలిచి కప్‌ను సొంతం చేసుకుంది. విజయవాడలో జరిగిన క్యారమ్స్ పోటీలో విన్నర్స్‌గా, కాకినాడలో జరిగిన హాకీ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలను గతనెల 28న నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీడిసిఎల్ ఎస్ఇ, జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. తమ ఉద్యోగులు పోటీల్లో ఉత్తమంగా నిలవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ సోమశేఖర్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌వర్మ, హాకీ విజేతలు శ్రీనివాసులు, ఆదిబాబు, వేలు, నవీన్, సుబ్రహ్మణ్యం, నారాయణ, భాస్కర్, శీను, ధన, ప్రతాప్, జాషువా, నారాయణతో పాటు క్యారమ్స్ విజేతలు శ్రీమన్నారాయణ, విక్టర్, సుధ, సి.జయచంద్రారెడ్డి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు
# పరిశుభ్రంగా ఉండాలి
**- సిడిపిఓ హేనా సుజన**



అంగన్‌వాడీ కేంద్రాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వంటలకు పరిశుద్ధమైన నీటిని ఉపయోగించాలని, వంటపాత్రలను శుభ్రంగా ఉంచాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ హేనాసుజన అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఇటీవల ఆమె ఇందుకూరుపేటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో పాల్గొన్నారు. చిన్నారులకు తరచూ ఆరోగ్యపరీక్షలు చేయిస్తుండాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం నూతన వెర్షన్ యాప్ పట్ల అంగన్‌వాడీలకు అవగాహన కలిగించారు. సెక్టార్ సూపర్‌వైజర్లు ఎం.నాగేశ్వరి, సిహెచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జొన్నవాడలో లక్ష బిల్వార్చన

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో గతనెల 28న శ్రీ మల్లికార్జునస్వామికి లక్ష బిల్వార్చన పూజలను కన్నులపండువగా నిర్వహించారు. 20 మంది ఋత్విక్కులు స్వామివారి ఉత్సవమూర్తికి మహామండపం వద్ద పుష్పాలంకరణ చేసి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. జొన్నవాడ వాస్తవ్యులైన రమణమ్మ, కామాక్షి ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అర్చకులు ఉభయకర్తలకు వేదాశీర్వచనం చేశారు.

# విఆర్ఏల దీక్ష

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన విఆర్ఏలకు విఆర్ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతూ విఆర్ఏలు ఇటీవల సూళ్ళూరుపేటలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్ఏలకు కనీస వేతనంగానెలకు 21వేల రూపాయలతో పాటు టిఏ, డిఏలతో కూడిన వేతనాన్ని ఇవ్వాలని కోరారు. నామినీ విఆర్ఏలను క్రమబద్ధీకరించాలన్నారు. విఆర్ఏలు శివ, చెంగయ్య, మునిబాబు తదితరులు పాల్గొన్నారు. పలువురు సిఐటియు నాయకులు విఆర్ఏల ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

## టీకాలు వేయడంలో..
# రాష్ట్రంలో నెల్లూరుదే అగ్రస్థానం



నెల్లూరు పెద్దాసుపత్రిలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

ప్రజారోగ్యానికి సంబంధించి అనేకరకాల వ్యాధుల నివారణకు వివిధ రకాల టీకాలు వేయడంలో రాష్ట్రంలో నెల్లూరు జిల్లా ముందంజలో ఉందని, కోవిడ్ టీకాలు వేయడంలో కూడా జిల్లా ప్రథమస్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. పల్స్‌పోలియో కార్యక్రమం సందర్భంగా గతనెల 27న నెల్లూరు పెద్దాసుపత్రిలో చిన్నారులకు కలెక్టర్ పోలియోచుక్కలు వేశారు. జిల్లాలో ఐదేళ్ళలోపు చిన్నారులు 3.48 లక్షల మందిదాకా ఉన్నారని, వారందరికీ జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో రహిత సమాజంకోసం ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు.

# లక్ష్యాన్ని అధిగమించి.. పల్స్‌పోలియో

**జిల్లాలో 100.79 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు**

పోలియో వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం జిల్లాలో విజయవంతం కావడమే కాక అనుకున్న లక్ష్యాలను అధిగమించింది. గతనెల 27 నుంచి మార్చి 1వ తేదీవరకు మూడురోజుల పాటు ఈ కార్యక్రమం జరిగింది. వైద్యసిబ్బంది జిల్లాలో వాడవాడలా తిరిగి అనేకమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి అందరి అభినందనలు అందుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ముందుగానే ఇంటింటి సర్వే ద్వారా అయిదేళ్ళలోపు వయసున్న 3,43,699 మంది చిన్నారులను గుర్తించారు. వైద్యసిబ్బందితో పాటు వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు అందరూ ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయని చిన్నారులను గుర్తించి ఈనెల 1న మరింతమందికి పోలియో చుక్కలు వేశారు. దీంతో పోలియో చుక్కలు వేసుకున్న చిన్నారుల సంఖ్య 3,49,795 మందికి పెరిగింది. మొత్తంగా 100.79 శాతం మందికి పోలియో చుక్కలు వేసి లక్ష్యాన్ని అధిగమించడంతో పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందినందరినీ జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

# చోళుల కాలం నాటి 'మాంబట్టు' కాశీవిశ్వేశ్వర క్షేత్రం

*'సత్యచిద్ఘన మఖండ మద్వయం*
*సర్వదృశ్యరహితం*
*నిరామయం యత్పదం*
*విమల మద్వయం శివం'..* అంటోంది వరాహోపనిషత్. సత్యమై, చిద్ఘనమై, అఖండమై, అద్వయమై, సర్వదృశ్యరహితమై, నిరామయమై, విమలమై ఏ పరబ్రహ్మమైతే ఉంటాడో..సాక్షాత్తూ ఆ పరబ్రహ్మమే శివుడని అందులోని భావం. 'శివం కరోతీతి శివ:'.. అని వేదాలు చెప్తున్నట్లుగా సర్వశుభాలను కలిగించే దైవం శివుడే. దేవాదిదేవుడైన ఆ సదాశివుని సదా ధ్యానించుకోవడం ఎంతో పుణ్యప్రదమని, సర్వపాపాలు పరిహరించి, సకల శుభాలు కలిగించేది శివారాధనేనని పురాణాలు చెప్తున్నాయి. అందుకే మన భారతావనిలో ఎల్లెడలా శివభక్తికి లోటులేకుండా ఎన్నో మహత్తరమైన ఆలయాలున్నాయి. అలాంటి వాటిలో నెల్లూరుజిల్లాలోని తడ మండలంలో ఉన్న చిన్న మాంబట్టు అనే చిన్నగ్రామంలో గొప్ప శివాలయం ఉంది. అందులోనూ ఇది ఎంతో మహిమాన్వితమైన కాశీవిశ్వేశ్వర క్షేత్రం. ఇక్కడి శివలింగం స్వయంభువు కావడం విశేషం. ఈ ఆలయ చరిత్ర ఎంతో ఘనమైనది.

జిల్లాలోని తడ మండలంలో ఈ ఆలయం ఉంది. సూళ్ళూరుపేట నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అపాచీ సెజ్ రోడ్డులో వెళ్తే అక్కడి నుంచి కొద్దిదూరంలోనే ఈ ఆలయం కనిపిస్తుంది. ఆలయానికి వెళ్ళేందుకు చక్కటి రహదారి సౌకర్యం కూడా ఉంది.

### ఆలయ చరిత్ర :

ఇది క్రీస్తుశకం 11వ శతాబ్దిలోని చోళరాజుల కాలం నాటి ప్రాచీనమైన ఆలయంగా ప్రసిద్ధి. ఒకప్పటి 'అహంబట్టు' అనే గ్రామమే కాలక్రమంలో మాంబట్టుగా మారిందని చెప్తుంటారు. నాటి రాజుల కాలంలో యనమంద్ర నారసింహయ్యశర్మ అనే సేనాధిపతి శివునిపై అచంచల భక్తితో ఈ ఆలయం








**మన దేవాలయాలు (89)**

నిర్మించాడని అంటారు. అప్పట్లో ఓ భక్తుడు కాశీనుంచి స్వయంభు శివలింగాన్ని తీసుకు వస్తుండగా ఆ శివలింగాన్ని కోరి తెచ్చుకుని ఇక్కడ ప్రతిష్టించారని ప్రతీతి. విశాలమైన స్థలంలో సర్వాంగసుందరంగా ఉన్న ఈ ఆలయం గంగా అన్నపూర్ణేశ్వరిదేవి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంగా నాటికాలం నుంచి నేటికీ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంది. గర్భాలయంలో భక్తవరదుడైన పరమశివుడు లింగరూపధారిగా కొలువై ఉంటాడు. పక్కనే చల్లనితల్లి అన్నపూర్ణాదేవి అమ్మవారి మందిరం ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, దక్షిణామూర్తి, బ్రహ్మ, మహావిష్ణువు, చాముండేశ్వరి దేవి, వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మందిరాలు, నవగ్రహ మండపం వగైరాలన్నీ అత్యద్భుతంగా తీర్చిదిద్దినట్లు ఉంటాయి.

### శివయ్యకు సూర్య కిరణార్చన :

గర్భాలయంలో ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరునిపై నిత్యం సూర్యకిరణాలు ప్రసరిస్తూ ఉండడం ఈ ఆలయంలో మరో ప్రత్యేకత. ఆలయం తూర్పువాకిలి నుంచి ఆ ప్రభాకరుని కిరణాలు ఆ పరమేశ్వరునిపై ప్రసరిస్తున్న దృశ్యం నయనమనోహరంగా ఉంటుంది.

### అత్యంత పురాతనమైన శివాలయం :




జిల్లాలో ఈ ఆలయాన్ని అత్యంత పురాతనమైన శివాలయంగా ప్రభుత్వం గుర్తించింది. పురావస్తు శాఖ వారు ఆ విషయాన్ని ధృవీకరిస్తూ ఆలయం ఎదుట బోర్డును కూడా ఏర్పాటుచేశారు. ఈ ఆలయాన్ని ప్రాచీన కట్టడంగా, 'రక్షిత స్మారకచిహ్నం'గా పేర్కొంటూ, దీనిని యథాతథంగా ఉంచాలని, ఎలాంటి మార్పుచేర్పులు చేయరాదని స్పష్టం చేసింది. ఇలాంటివి పూర్వీకులు మనకందించిన వారసత్వ సంపదలని, వాటిని పరిరక్షించుకోవాలని సూచించింది.

ఆలయంలో నిత్యపూజలతో పాటు ఏటా కార్తీక దీపోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతుంటాయి. ఆలయ ఛైర్మెన్ చేజర్ల మునిశ్రీనివాసులు పర్యవేక్షణలో స్వామివార్లకు అన్ని వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఆలయం ఎంతో మహత్తరమైనదని, అందుకే ఆలయం అభివృద్ధి చెందే కొద్దీ ఈ ప్రాంతమంతా బాగా అభివృద్ధి చెందుతోందని, కొంతకాలం క్రితం మాంబట్టు సెజ్ కూడా ఇక్కడే ఏర్పడడంతో ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం కూడా ఎంతో సహకారం అందిస్తోందని గ్రామస్తులు చెప్తున్నారు. ఇటీవల మాంబట్టు గ్రామస్తుడు, స్విమ్స్ డాక్టర్ కె.మునుస్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభించి, ఆ తర్వాత దాతలు, గ్రామస్తుల సహకారంతో అన్నదాన మందిరం కూడా నిర్మించారు. ఇలా.. ఎంతోకాలం నుంచి గ్రామస్తులతో పాటు ఎందరో దాతలు ఆలయాన్ని దినదినప్రవర్ధమానం చేస్తూనే ఉన్నారు.

# కళ్యాణ వైభవం...!

## షేహబాజ్ హనూర్ - షర్మిల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, విభజనాంధ్రాలోనూ రవాణా శాఖలో వివిధ హోదాలలో పనిచేసి ప్రస్తుతం ఆర్టీఓ స్థాయిలో విజయవాడలోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్‌కరీం - రెహానాసుల్తానాల కుమారుడు షేహబాజ్ హనూర్ - షర్మిలల నిఖా ఫిబ్రవరి 27న నెల్లూరులోనూ, రిసెప్షన్ 28న గుంటూరులోనూ ఘనంగా జరిగాయి. ఇటు నెల్లూరులోనూ అటు గుంటూరులోనూ కరీంకి మంచి స్నేహసంబంధాలు ఉండడంతో రెండు వేడుకలలోనూ అధిక సంఖ్యలో అతిథులు పాల్గొని కొత్త జంటను దీవించారు. హనూర్ - షర్మిలలకు 'లాయర్' శుభదీవెనలు.



రిసెప్షన్‌కి హాజరై నవ వధూవరులను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర ఇంటిలిజెన్స్ డీజీ పిఎస్ఆర్ ఆంజనేయులు.

# సారా విక్రయాలపై.. సెబ్ దాడులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో గుట్టుగా సాగుతున్న సారా విక్రయాలను అరికట్టేందుకు సెబ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఆదేశాలతో జిల్లాలోని అనేకప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమై నాటుసారా తయారీ, విక్రయాలపై దృష్టి సారించి వాటి నిరోధానికి చర్యలు తీసుకుంటున్నారు. గత రెండు నెలల్లోనే ముఖ్యంగా కావలి, కోవూరు, బుచ్చి, ఆత్మకూరు ప్రాంతాల్లో నాటుసారా బట్టీలపై దాడులు చేసి 132 కేసులు నమోదు చేశామని, 39మందిని అరెస్ట్ చేశామని నెల్లూరు సెబ్ సూపరింటెండెంట్ కృష్ణకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. నాటుసారా తయారీదారుల నుంచి 399 లీటర్ల నాటుసారాతో పాటు 75 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని, నాటుసారా తయారీకోసం సిద్ధంగా ఉంచుకున్న సుమారు 52,630 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని వివరించారు. వీటితో పాటు సారాను రవాణా చేసే ఏడు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

# మోడీతో 'ఢీ'కి కేసిఆర్ రెడీ

(మొదటి పేజీ తరువాయి)

సవాలు కూడా విసురుతున్నారు. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా కలిశారు. ఇంకా కలుస్తానని కూడా ప్రకటించారు. అయితే ఇప్పుడు రాజకీయ విశ్లేషకుల అనుమాన మంతా ఒక్కటే... కల్వకుంట్ల కొత్త కూటమిలో ఆంధ్ర సీఎం జగన్ ఉంటారా..? లేదా..?? 2014లో రాష్ట్రం విడిపోయి విభజనాంధ్రలో చంద్రబాబు అధికారంలో ఉన్న అయిదేళ్ళు ఆ చంద్రానికీ ఈ చంద్రానికీ అస్సలు పడలేదు. పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు ఉన్నప్పటికీ చంద్రబాబుని కేసీఆర్ అక్కడ ఉండనీయ లేదు. అటు కేసీఆర్‌కి ఇటు జగన్‌మోహన్‌రెడ్డికీ ఇద్దరికీ కామన్ శత్రువు బాబే కావడంతో 2019 ఎన్నికలలో వైసీపీకి మద్దతుగా నిలిచారు కేసీఆర్. అంతేకాదు, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారిద్దరిమధ్య సయోధ్య కొనసాగుతూనే ఉంది. కేసీఆర్‌కి వ్యతిరేకంగా జగన్ చెల్లెలు షర్మిల తీవ్ర పదజాలంతో విమర్శలు సంధిస్తున్నా... ఈ ఇద్దరు సీఎంల మధ్య మాత్రం ఇప్పటివరకు స్నేహం చెక్కు చెదరలేదన్నది కాదనలేని సత్యం.

### ఇప్పుడు జగన్ ఎటువైపు...?!

కేసీఆర్ కూటమితో ఆంధ్ర సీఎం జతకడతారా..? అన్న ప్రశ్నకి 'లేదు' అని సమాధానం చెప్తున్నారు విశ్లేషకులు. మోడీ కేసీఆర్‌ల వివాదాన్ని జగన్ అవకాశంగా మార్చుకుని స్పెషల్‌స్టేటస్ వంటి అంశాలను తెరపైకి తెచ్చి కేంద్రం నుండి రాష్ట్రానికి కావలసిన మేళ్లు చేయించుకుంటారన్నది వారి అభిప్రాయం. చంద్రబాబుతో మళ్ళీ జత కట్టడం కమలం పార్టీ పెద్దలకు ఇష్టం ఉండదు కాబట్టి, వైసీపీతోనే అంతర్గత ఒప్పందానికి భాజాపా మొగ్గు చూపించే అవకాశాలే ఎక్కువని అంటున్నారు విశ్లేషకులు. అక్కడక్కడా చిన్న చిన్న అసంతృప్తులు ఉన్నా ఎన్నికలనాటికి అన్నీ సర్దుకుని వైసీపీ మళ్ళీ అధికారంలోకి రావడం మాత్రం ఖాయం అన్న మాట సర్వత్రా వినపడుతోంది. ఇలాంటి తరుణంలో జగన్‌తో దోస్తీకే కేంద్రం ఆసక్తి చూపిస్తుందన్నది వారి ఆలోచన.

రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల తీర్పులు, సిబిఐ దూకుడు, విచారణలో జగన్ కేసులు... ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఈ తరుణంలో కేంద్రంతో గొడవకు దిగితే కొరివితో తలగోక్కున్నట్లేనన్న విషయం వైసీపీ వర్గాలకు కూడా బాగా తెలుసన్నది వారి భావన. కాబట్టి కేంద్రంతో ఢీకొట్టే విషయంలో జగన్ కేసీఆర్‌తో జత కట్టకపోగా ఆ అంశాన్ని తనకు అవకాశంగా మార్చుకుని రాష్ట్ర సంక్షేమం కోసం పాటుపడవచ్చన్న ఆశాభావాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

## క్యాన్సర్ బాధితుడిని ఆదుకున్న ప్రసన్న

బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఇందుకూరుపేట మండలం రాముడుపాళెం గ్రామానికి చెందిన మైనంపాటి ఆదినారాయణ చికిత్స కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 50వేల రూపాయలు సాయం అందించి ఆదుకున్నారు. ఈనెల 2న ఆయన ఆ నగదును ఆదినారాయణ భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ఆరుగురికి కరోనా

జిల్లాలో కరోనా వ్యాధి తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తోంది. వందల్లో ఉన్న కేసులు పదుల్లోకి వచ్చి.. ఇప్పుడు 10లోపే వస్తున్నాయి. ఈనెల 2వ తేదీన 408 మందికి కరోనా పరీక్షలు చేస్తే వారిలో ఆరుగురికి మాత్రం కరోనా పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. వారికి వెంటనే చికిత్సలు ప్రారంభించారు. వైద్య అధికారుల గణాంకాల ప్రకారం.. నెల్లూరు పెద్దాసుపత్రిలో మరో 9మంది ఈ వ్యాధితో ప్రస్తుతం చికిత్సలు పొందుతున్నారు. జిల్లాలో మరో 85 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటిదాకా జిల్లాలో ఈ మహమ్మారి వ్యాధి మొత్తం 1,64,310 మందికి సోకగా, వారిలో 1,63,135 మంది వైద్యచికిత్సలతో కోలుకున్నారు. ఈ వ్యాధితో ఇప్పటిదాకా 1090 మంది మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో కరోనా కేసులు తగ్గినట్లనిపిస్తుండడంతో అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే, ఈ వ్యాధి తగ్గినట్లే ఉంటుంది కానీ పూర్తిస్థాయిలో తగ్గిపోయిందని నిర్ధారించుకునేదాకా దానిని నమ్మడానికి లేదని, అప్పటిదాకా ఈ వ్యాధి పట్ల అందరూ జాగ్రత్తగానే ఉండాలని, మాస్కులు ధరించి కోవిడ్ నిబంధనలు పాటిస్తుండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# 'నారీ సంకల్ప దీక్ష' విజయవంతం చేయండి

- మాజీమంత్రి సోమిరెడ్డి



తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6న 'నారీ సంకల్ప దీక్ష' జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని మాజీమంత్రి, టీడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 2న ఆయన నగరంలోని టీడిపి కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని, మహిళలకు భద్రత కరువైందని, ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండబిట్రగుంటలో 13 నుంచి బ్రహ్మోత్సవాలు



కొండబిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 19వ తేది దాకా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీఏర్పాట్లు చేస్తున్నారు. 13న ఉదయం గిరిప్రదక్షిణ అనంతరం రాత్రికి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తామని ఆలయ ఛైర్మన్ శ్రీరామాల్యాద్రి, ఇ.ఓ రాధాకృష్ణ తెలిపారు. 14న ఉదయం తిరుమంజనం, రాత్రికి ధ్వజారోహణం, శేషవాహన సేవ, 15న హనుమంత వాహనసేవ, 16న ఉదయం మోహిని ఉత్సవం, రాత్రికి గరుడసేవ, 17న తెప్పోత్సవం, గజవాహనసేవ, 18న కల్యాణం, రథోత్సవం నిర్వహించిన అనంతరం రాత్రికి అలకలతోపు, అశ్వవాహన సేవ నిర్వహిస్తామన్నారు. 19న పుష్కరిణిలో చక్రస్నానం, సాయంత్రం పుష్కరయాగం జరుగుతుందని, ఆరోజు రాత్రి జరిగే ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయని పేర్కొన్నారు.

# నెల్లూరును 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా మార్చాలి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కెవి చలమయ్య

నెల్లూరును 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా మార్చాలని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఏపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్య ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లాను వైఎస్సార్‌జిల్లాగా ప్రకటించారని, అదేవిధంగా నెల్లూరును కూడా 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతున్నామన్నారు. మార్చి 16న శ్రీ పొట్టి శ్రీరాములు 121వ జయంతి రోజున ఆ తీపికబురును ప్రభుత్వం జిల్లా ప్రజలకు అందించాలని ఆయన కోరారు.

# గల్లంతైన బాలుర మృతదేహాల వెలికితీత



వెంకటగిరి సమీపంలోని జంగాలపూడి వద్ద తెలుగు గంగ కాలువలో గల్లంతైన బాలురు మాతంగి ప్రతాప్, బాలాజీల మృతదేహాలు లభించాయి. ఈనెల 2వ తేదీన అగ్నిమాపకసిబ్బంది వారి మృతదేహాలను తెలుగుగంగ రైల్వే ట్రాక్ వద్ద కాలువలో గుర్తించి వెలికితీశారు. శివాలయంలో దైవదర్శనం కోసం ముందుగా స్నానంచేద్దామని గంగ కాలువలోకి దిగిన ఆ ఇద్దరు బాలురు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. ఆరోజు ఎంతగా గాలించిన వారి ఆచూకీ లభించలేదు. ఎట్టకేలకు అగ్నిమాపకశాఖ సిబ్బంది కృషితో వారి మృతదేహాలను కనుగొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల మృతదేహాలను చూసి పెద్దపెట్టున రోదించారు.

# హరహర మహాదేవ!..

- శివ నామస్మరణలతో మార్మోగిన శివాలయాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- భక్తిశ్రద్ధలతో జిల్లాలో మహాశివరాత్రి పర్వదినం



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్చి 1న జిల్లావ్యాప్తంగా శివాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. ఓం నమ:శివాయ, శంభో శంకర, హరహర మహాదేవ అంటూ భక్తులు ఆ పరమశివుడి నామోచ్చారణలు చేస్తూ ఆలయాల్లో ప్రదక్షిణలు చేసుకుని ఆదిదంపతులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానమయ్యాయి. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పరమేశ్వరునికి విశేషపూజలు, సేవలు జరిగాయి. మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అర్ధరాత్రి సమయంలో లింగోద్భవ అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పెన్నాతీరంలో శివ భక్తులు సైకత లింగం ఏర్పాటుచేసి పెద్దఎత్తున పూజలు చేశారు.

### జొన్నవాడలో :

జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, వెండి నంది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇ.ఓ వెంకట శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. అదేవిధంగా ప్రముఖ శైవక్షేత్రాలైన రామతీర్థంలోని కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, గండవరంలోని గంగా పార్వతీ సమేత ఉదయకాళేశ్వరస్వామి దేవాలయం, మైపాడులోని అన్నపూర్ణాదేవి సమేత శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి దేవస్థానం, ఆత్మకూరులో అన్నపూర్ణాదేవి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం, గూడలిలో సంగమేశ్వరస్వామి దేవాలయం, ముదివర్తి పాళెంలోని శివాలయం, కాటేపల్లి శివాలయం, బుచ్చిలోని కనకదుర్గాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర మల్లేశ్వరస్వామి దేవస్థానం, మాంబట్టులోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కోడూరుపాడులో గంగాపార్వతీ సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం.. తదితర ఆలయాల్లో ఆదిదంపతులకు విశేషపూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవాలు, వాహనసేవలు వైభవోపేతంగా నిర్వహించారు.



భక్తజన సందోహంతో నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయం

### శ్రీ మూలస్థానేశ్వరాలయంలో :

మహాశివరాత్రి శోభతో నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయం దేదీప్యమానమైంది. ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా భక్తజనం ఆలయానికి పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి దేదీప్యమానం చేశారు. గర్భాలయంలో కొలువైవున్న స్వామివారికి ఉదయం గిన్నెభిక్ష అలంకారం నిర్వహించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 10 గంటలకు లింగోద్భవాభిషేకం కన్నుల పండువగా జరిగింది. అనంతరం రాత్రి 1 గంట ప్రాంతంలో స్వామివారికి నందిసేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇ.ఓ ఆరంబాకం వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఆలయాన్ని సందర్శించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్పీని ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.



రాజరాజేశ్వరిదేవి ఆలయంలో సుందరేశ్వరస్వామి వారి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో :

నగరంలోని దర్గామిట్టలో శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ సుందరేశ్వరస్వామివారి సన్నిధిలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక, ఆనం రామనారాయణరెడ్డి, శిరీష, కొండూరు హరినారాయణరెడ్డిలు ధర్మకర్తలుగా వ్యవహరించారు.



## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఈనెల 1న వాసవిక్లబ్ వారు పెద్దఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ తిరువీధి రాధాకృష్ణయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు మొగళ్ళూరు వెంకటశేషయ్య, సొల్లేటి ప్రభాకర్, కారంశెట్టి ప్రసాద్, గాదంశెట్టి శ్రీనివాసులు, బి.సుబ్బారావు, నారాయణ, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

### కొండబిట్రగుంట ఆలయానికి..

## ధర్మకర్తల నియామకం

కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఈనెల 1న దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారని ఇ.ఓ రాధాకృష్ణ తెలిపారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా శ్రీరాం మాల్యాద్రి, ధర్మకర్తలుగా ఒట్టూరు మాల్యాద్రి, కొర్శిపాటి ఓబుల్‌రెడ్డి, బుల్లా రమ, చలంచర్ల శీనమ్మ, నాగినేని వాణిశ్రీ, అరవ తులసీ రామ్, చీకుర్తి కోటమ్మ, పి.సులోచనమ్మ, ఎక్స్‌అఫిషియో సభ్యునిగా వి.కల్యాణచక్రవర్తి నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు.



### శ్రీకాళహస్తి దేవాలయంలో...

## కన్నులపండువగా మహాశివరాత్రి

శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబికాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి సన్నిధిలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 24వ తేదిన ప్రారంభమైన ఈ ఉత్సవాలు మార్చి 8వ తేది వరకు కన్నులపండువగా జరుగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుంటున్నారు. 24వ తేది సాయంత్రం అంకురార్పణ జరిగింది. అనంతరం కన్నప్ప ధ్వజారోహణం, 2వ రోజున ధ్వజారోహణం, వెండి అంబారీసేవ, 3వ రోజున సూర్యప్రభ, చప్పరవాహనసేవలు, భూత–శుక వాహనసేవలు



ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకువెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

జరిగాయి. 4వ రోజున హంస, యాళివాహనసేవలు, రావణ–మయూరవాహనసేవలు నిర్వహించారు. 5వ రోజు హంస–శుక వాహన సేవలు, శేషవాహనం–యాళి వాహన సేవ వైభవంగా చేపట్టారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున రాష్ట్ర పంచాయతిరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి–స్వర్ణమ్మ దంపతులు స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మార్చి 1వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి నందిసేవ వేడుకగా జరిగింది. అనంతరం ఇంద్రవిమానం, చప్పరసేవ, రాత్రికి నందివాహనం, సింహవాహనోత్సవం వైభవోపేతంగా జరిగాయి. 2వ తేదిన అంగరంగవైభవంగా రథోత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం తెప్పోత్సవంలో స్వామివారు భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. 3వ తేదీన నందివాహనసేవ, కామదేనువు వాహనసేవలు,. రాత్రికి గజ–సింహవాహనసేవలు జరిగాయి. 4వ తేదీన స్వామివారికి రుద్రాక్ష అంబారీ వాహనసేవ, శ్రీ సభాపతి కల్యాణం జరుగనున్నాయి. 5న కైలాసగరి ప్రదక్షిణ జరుగుతుంది. ఇదే రోజున స్వామివారికి బనాత అంబారి వాహనసేవ, రాత్రికి అశ్వ, సింహవాహన సేవలు నిర్వహిస్తారు. 6న తీర్థవారి ధ్వజవరోహణం జరుగుతుంది. అనంతరం 12వ రోజైన 7వ తేదీన స్వామివారికి పల్లకిసేవ నిర్వహిస్తారు. మార్చి 8వ తేదీన రాత్రి 9 గంటలకు స్వామివారికి ఆలయం లోపల పల్లకిసేవ చేస్తారు. అనంతరం 9వ తేది ఉదయం 10 గంటలకు శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

## శివరాత్రి రోజున విషాదం

- తెలుగుగంగ కాలువలో ఇద్దరు బాలురు గల్లంతు
- ఆచూకీ కోసం గాలింపు

మహాశివరాత్రి రోజున ఆ గ్రామంలో విషాదం అలముకుంది. ఊహించని విధంగా ఇద్దరు బాలలు కాలువలో పడి గల్లంతైపోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వెంకటగిరిలోని జంగాలపల్లి వద్ద మార్చి1న ఈ దుర్ఘటన జరిగింది. శివరాత్రి సందర్భంగా జంగాలపల్లి గ్రామం శివాలయంలో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు ముందుగా స్నానం చేద్దామని సర్వేపల్లి బాలాజీ (13), మాతంగి ప్రతాప్ (16)లు పక్కనే ఉన్న తెలుగుగంగ కాలువలోకి దిగారు. ప్రమాదవశాత్తు కాలువ ప్రవాహంలో కొట్టుకుపోయారు. బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బాలాజీ 7వ తరగతి చదువుతున్నాడు. కూలిపని చేసుకుని జీవించే అంజయ్య, సుబ్బలక్ష్మి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడైన బాలాజీ గల్లంతయ్యాడన్న సమాచారం తెలిసి ఆ తల్లితండ్రుల రోదన అంతా ఇంతా కాదు. బంగారుపేటకు చెందిన చిన్న పెంచలయ్య, రమణమ్మల పెద్దకుమారుడైన ప్రతాప్ 10వ తరగతి దాకా చదువుకున్నాడు. మూగ, బుద్ధిమాంద్యంతో ఉన్న ప్రతాప్ నీళ్ళలో కొట్టుకుపోవడంతో ఆ బాలుడి తల్లితండ్రులు తల్లడిల్లిపోతున్నారు. పోలీసులు, తల్లితండ్రులు, గ్రామస్తులు అందరూ కలసి ఆ పిల్లల కోసం రాత్రిదాకా ఎంతగా గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో గాలింపు ముమ్మరం చేశారు.



కీ॥శే॥ శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి గారు
దివంగత రాష్ట్ర మంత్రివర్యులు



పలుకరించిన వారికి
## ప్రణామాలు

మా
గౌతమయ్య
మమ్మల్ని విడిచి వెళ్లిన
దుఃఖ సమయంలో
మమ్మల్ని, మా కుటుంబసభ్యులను
పలుకరించిన ప్రతి ఒక్కరికీ
మా ప్రణామాలు.

మీ..
**పాపకన్ను** కుటుంబసభ్యులు
వేపినాపి, రాపూరు మండలం, నెల్లూరుజిల్లా.

## 21వ వర్ధంతి

పూజ్యులు
## స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2022 నాటికి
21 సంవత్సరాలు నిండుతాయి.
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
రాజ్యసభ సభ్యులు



Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com